
ప్రజాజ్యోతి
కరీంనగర్
రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి
శుక్రవారం 15, మే 2026 www.prajajyothinews.com పేజీలు :10

# కరీంనగర్‌ను వణికించిన పిఎంజె దోపిడీ కేసు ఛేదన..!

వివరాలు 3లో..



- సర్వేయర్ కోసం రైతుల పడిగాపులు
- భూ తగాదాల పరిష్కారానికి సర్వేయర్ పాత్ర కీలకం....
- తహాశీల్దార్ కార్యాలయం వద్ద నిరీక్షణ..
- పట్టించుకోని యంత్రాంగం

# హద్దులు చూపే.. వారెవరు...?

మల్యాల,మే14, ప్రజాజ్యోతి: భూ సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాల్సిన సర్వేయర్ అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ భూమికి సంబంధించిన హద్దులు తెలుసుకోవడానికి, తగాదాలను పరిష్కరించుకోవడానికి రైతులు మల్యాల తహాశీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. తాసిల్దార్ కార్యాలయంలో సర్వేయర్ గురించి అడిగితే సమాధానం చెప్పే నాథుడే కరువయ్యాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేయర్ ఫోన్ నెంబర్ తెలుసుకొని ఫోన్ చేస్తే స్పందించడం లేదనే వాదనలు లేకపోలేదు. సర్వేయర్ ఎప్పుడు వస్తారో?తెలియక రైతులు తలలు పట్టుకునె పరిస్థితి మల్యాల మండలంలో నెలకొంది. వివరాలు2లో..

## త్వరితగతిన ధాన్యం తరలించాలి

–కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులపరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్






## ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ

- టెస్టుల పేరుతో భారీ బిల్లులు.. 10లో..
- కనీస సౌకర్యాల్లేక రోగుల ఇబ్బందులు
- ఆరోగ్యశ్రీ దుర్వినియోగం పై ఆరోపణలు..

# హద్దులు చూపే వారెవరు?





**మల్యాల,మే 14, ప్రజా జ్యోతి :** భూ సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాల్సిన సర్వేయర్ అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ భూమికి సంబంధించిన హద్దులు తెలుసుకోవడానికి, తగాదాలను పరిష్కరించుకోవడానికి రైతులు మల్యాల తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. తాసిల్దార్ కార్యాలయంలో సర్వేయర్ గురించి అడిగితే సమాధానం చెప్పే నాథుడే కరువయ్యాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేయర్ ఫోన్ నెంబర్ తెలుసుకొని ఫోన్ చేస్తే స్పందించడం లేదనే వాదనలు లేకపోలేదు. సర్వేయర్ ఎప్పుడు వస్తారో? తెలియక రైతులు తలలు పట్టుకునె పరిస్థితి మల్యాల మండలంలో నెలకొంది.

**– సర్వేయర్ కోసం రైతుల పడిగాపులు**

మల్యాల తాసిల్దార్ కార్యాలయం వద్ద సర్వేయర్ కోసం రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. గత కొన్ని నెలలుగా తమకు సంబంధించిన భూ హద్దుల సమస్యను పరిష్కరించాలంటూ ఆర్ ఐ, సర్వేయర్ లను కోరిన ప్రయోజనం లేకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేయర్ పొంతన లేని సమాధానంతో కొంతమంది రైతులు అసహనానికి గురి అవుతున్నారు. గత కొన్ని నెలలుగా ప్రభుత్వానికి సంబంధించిన భూ సర్వేలలో తాను బిజీగా ఉన్నానని చెబుతూ కాలయాపన చేస్తుంటే తమ పరిస్థితి ఎలా అని సంబంధిత అధికారులను రైతులు ప్రశ్నిస్తున్నారు. కరీంనగర్ జగిత్యాల రహదారి సంబంధించిన సర్వే లో పాల్గొన్న సర్వేయర్ తర్వాత కొండగట్టు ఫారెస్ట్ దేవాదాయ శాఖకు సంబంధించిన భూ వివాదంలో సర్వేలు నిర్వహించారు. ప్రస్తుతం డిప్యూటేషన్ పై బీర్పూర్ మండలంలో సర్వే విధులు నిర్వహిస్తూ కొంత సమయాన్ని మల్యాల మండలానికి కేటాయిస్తున్నట్లు సమాచారం. ఇట్టి విషయంపై పలుమార్లు రైతులు అధికారులను ప్రశ్నించిన ప్రయోజనం లేకపోయింది. దీనిపై రైతు సంఘాల నాయకులు, పై అధికారులు స్పందించి సర్వేయర్ మల్యాల మండలంలో అందుబాటులో ఉండి, విధులు నిర్వహించేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

**– భూ తగాదాల పరిష్కారానికి కీలకమైన సర్వేయర్ పాత్ర**

భూమి క్రయవిక్రయాలు జరిగినప్పుడు లేదా కుటుంబాల మధ్య భూ పంపకాలు జరిగినప్పుడు 'సర్వేయర్' పాత్ర అత్యంత కీలకం. క్షేత్రస్థాయిలో సర్వే నంబర్ల ప్రకారం హద్దులు నిర్ణయించాల్సింది సర్వేయర్లే. అయితే, మల్యాల మండలంలో సర్వేయర్ సకాలంలో అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంట ఉన్న సమయంలో భూమికి హద్దులు తెలపడం ఇబ్బందికరం అని సర్వేయర్ తెలపడంతో పంట కోయడంతో ఇకనైనా తమ భూ తగాదాలను పరిష్కరించుకోవడానికి ఆస్కారం ఉంటుందని భావించిన రైతులు ప్రభుత్వ సర్వేయర్ గురించి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. పంట కోసిన సమయంలో భూ సర్వే జరగకుంటే ? భూ తగాదాల పరిష్కారానికి ఆస్కారం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే సకాలంలో జరగకపోవడం వల్ల రైతుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి.

**– తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరీక్షణ.... పట్టించుకోని యంత్రాంగం**

మల్యాల మండలంలో భూమి సర్వే జరగకపోవడంతో భూమికి సంబంధించిన పనులు ఆగిపోతున్నాయని రైతులు తెలుపుతున్నారు. సర్వే రిపోర్ట్ లేనిదే భూ మార్పిడి (మ్యుటేషన్ ) వంటి పనులు ముందుకు సాగడం లేదని అంటున్నారు . తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరీక్షణ రైతులకు తప్పడం లేదు. ?దూర ప్రాంతాల నుండి వందలాది రూపాయలు ఖర్చు చేసి వస్తున్న రైతులు, సర్వేయర్ ఎప్పుడు వస్తారో తెలియక గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. మీ–సేవ ద్వారా చలాన్ కట్టి నెలలు గడుస్తున్నా, కొందరు అధికారులు క్షేత్రస్థాయికి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఔట్సోర్సింగ్ ద్వారా జూనియర్ సర్వేయర్లను నియమించిన ప్రభుత్వ సర్వేయర్ నిర్ణయమే కీలకంగా మారడంతో పనులు అర్ధాంతరంగా నిలుస్తున్నాయి. భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలంటే సర్వేయర్ల కొరతను తీర్చడంతో పాటు, వారు రైతులకు అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. కార్యాలయానికి వచ్చే రైతులకు స్పష్టమైన సమాచారం ఇచ్చి, వారి సమస్యలను త్వరగా పరిష్కరించాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇట్టి విషయంపై మల్యాల తాసిల్దార్ ను ఫోన్ లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

# చత్రపతి శాంబాజీ మహారాజ్ జయంతి



**వేములవాడ,మే,14:ప్రజాజ్యోతి.** మరాఠా మహావీరుడు మహా యోధుడు చత్రపతి శివాజీ మహారాజ్ పెద్ద కుమారుడు 14 మే 1657 పురందరు కోటలో శివాజీ సాయిబాయ్ దంపతులకు జన్మించారు శాం భాజీ మహారాజ్ తల్లి మరణాంతరము చిన్నతనంలోనే నానమ్మ అయినా జిజియా బాయి పర్యవేక్షణలో పెరిగినాడు శివాజీ మరణాంతరము రాజ్యం యొక్క బాధ్యత తీసుకొని మరాఠ్వాడ ప్రజలకు ఎన్నో సేవలు చేశారు 1681 నుండి 1689 వరకు 9 ఏళ్ల పాటు ఒంటరిగా మొగల్ చక్రవర్తి ఔరంగజేబును ఎదిరించి హైందవ సామ్రాజ్యాన్ని కాపాడిన ధీరుడు సంస్కృత పండితులుగా గొప్ప యోధుడిగా ఏరొందిన శాంభాజీ 1689లో శత్రువులకు చిక్కిన లొంగకుండా వీరమరణం పొందారు 1681 శివాజీ వారసత్వంగా పొందినటువంటి మరాఠీవాడ రాజ్యము ను కాపాడుటకు మొగలు సిద్దిలు , మైసూర్ పోర్చ్చుషు వారితో నిరంతరం యుద్ధాలు చేశారు శంభాజీ మహారాజ్ ఒక యోదుడే కాదు సాంస్కృత మరాఠీ హిందీ ఫర్షియన్ భాషలలోప్రావీణ్యం కలిగిన రాజు మొగలులతో చిరకాలంగా యుద్ధాలు చేస్తూ మొగలు సామ్రాజ్యానికి సింహ స్వప్నం లాగా నిలిచారు 1689లోమొగులుల చేతికి చిక్కినప్పటికీ మతం మారమని నీ రాజ్యం నీకు ఇస్తానని ఔరంగజేబు చెప్పిన హిందూ మతం మారడానికి నిరాకరించి ఘోరమైన చిత్రహింసలు భరించి 11 మార్చ్ 1689న ప్రాణాలు అర్పించారు ఆయన అసాధారణ ధైర్యం కారణంగా ఆయనను చావా సింహంపిల్ల అని పిలుస్తారు మరాఠా రాజ్యానికి మూలపురుషుడైన శివాజీ మహారాజ్ కుమారుడైన హైందవ మరాఠి సామ్రాజ్యాన్ని కాపాడుట కొరకు తన ప్రాణాలర్పించిన మహాయోధుడు శంభాజీ మహారాజ్ కు జయంతి సందర్భంగా హిందుప్రజలు భారతీయులు ఆయనను స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తారు

# రాజన్న ఆలయం వద్ద 100 మంది అన్నార్తులకు భక్తులకు అన్నదానం

**వేములవాడ,మే,14:ప్రజాజ్యోతి.** మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1850 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున రాజన్న ఆలయం వద్ద 100 మంది అన్నార్తులకు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాతలుగా కొమ్ము చరణ్ రాజ్ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా వాస్తవ్యులు పంచాయితీ కార్యదర్శి కన్నారపు అభిలాష్ మరియు కుటుంబ సభ్యులు చెరుకుపల్లి ఉమాపతి రెడ్డి గారి వర్ధంతి సందర్భంగా వీరి కూతురు కె. ఆర్. ఉదయశ్రీ రెడ్డి, పెళ్లిరోజు సందర్భంగా మహేశుని రంజిత్ కుమార్ శ్రీలత దంపతులు అన్నదానంచేశారు మీ పుట్టినరోజు మీ పెళ్ళిరోజు సందర్భంగా ఇతరత్ర కార్యక్రమాలకు పేదలకు అన్నార్తులకు ఒక్కపూట అన్నదానం చేయలనుకునే దాతలు ట్రస్టు సభ్యులను గాని ట్రస్ట్ నంబరు 92469 39388కు సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. నేటి అన్నదాన కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్ పొలాస రాజేందర్ పసుల శ్రీధర్ మఠం శివకుమార్ గొట్టం శ్రీనివాస్ కన్నారపు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు



## కరీంనగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**– ఆచూకీ కోసం పోలీసులు విజ్ఞప్తి**



**కరీంనగర్ క్రైం,మే 14,ప్రజాజ్యోతి:** కరీంనగర్ బస్టాండ్ అవుట్ గేట్ వద్ద ఫిట్స్ వచ్చి పడిపోయిన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 29న మధ్యాహ్నం సమయంలో బస్టాండ్ వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోవడంతో స్థానికులు గమనించారు. ఈ క్రమంలో మున్సిపల్ శాఖ ఉద్యోగి కిరణ్ కుమార్ స్పందించి 108 అంబులెన్స్ ద్వారా అతడిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 11వ తేదీ రాత్రి అతను మృతి చెందాడు. ఆసుపత్రి సిబ్బంది అడిగినప్పుడు "కరీంనగర్", మరోసారి "గోదావరిఖని" అని చెప్పినట్లు సమాచారం. మృతుడి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉండగా,ఎత్తు 5 అడుగులు 2 ఇంచులు,చామనచాయ రంగులో ఉన్నాడు. బ్లాక్ నైట్ ప్యాంట్,తెల్ల డబ్బాలు గల చొక్కా ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ వ్యక్తి గురించి సమాచారం తెలిసిన వారు వెంటనే కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని లేదా 8712670761,8712574721 సెల్ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ఇల్లంతకుంట మే 14(ప్రజజ్యోతి)** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని రహింకన్పేట్ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి. గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు అసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది తెలిపిన https://tgms.telangana.gov. వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంపీసీ, బైపీసి, సీఇసీ, ఏసీఈ గ్రూపులలో 40 చొప్పున సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. 26 న దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల జాబితా, 27 న ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రదర్శిస్తామని తెలిపారు. 28 నుంచి 30 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు.

## మార్కెట్‌లో గిరాకీ ఉన్న వరి రకాల సాగుకు ప్రాధాన్యం

**'రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో డా. రాజేంద్ర ప్రసాద్ సూచనలు**



**ఇల్లందకుంట, మే 14(ప్రజాజ్యోతి):** రైతులు మార్కెట్‌లో గిరాకీ ఉన్న వరి రకాలనే సాగు చేయాలని వ్యవసాయ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐతీ. ఖ. రాజేంద్రప్రసాద్ సూచించారు. తెలంగాణ ప్రభుత్వ 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఇల్లంతకుంట మండల కేంద్రంలో నిర్వహించిన "రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు" కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగులో మార్పులు చేసుకోవాలని, వినియోగదారుల ఆదరణ ఉన్న సన్న రకాల వరిని పండిస్తే మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులు వాడటం ద్వారా భూసారం మెరుగుపడుతుందని వివరించారు.

అధిక మోతాదులో యూరియా వాడటం వల్ల పంటలకు తెగుళ్లు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వినియోగించి పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలని సూచించారు. సాగునీటిని పొదుపుగా వినియోగిస్తూ అధిక దిగుబడులు సాధించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నేల ఆరోగ్య పరిరక్షణకు పంట మార్పిడి విధానాలు పాటించడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి యం సూర్యనారాయణ వ్యవసాయ విస్తరణాధికారి రవళిక పాల్గొన్నారు. రైతులు అడిగిన సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు.

## త్వరితగతిన ధాన్యం తరలించాలి

-కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులపరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



**గంభీరావుపేట, మే 14(ప్రజా జ్యోతి);** కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. గంభీరావుపేట మండల కేంద్రం, మండలంలోని మల్లారెడ్డి పేట, ముస్తాఫానగర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం తనిఖీ చేశారు. లారీల కొరత లేకుండా వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే గంభీరావు పేట మండలం లింగన్నపేటలోని శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్, లక్ష్మీనారాయణ ఇండస్ట్రీస్, కొత్తపల్లిలోని వాయుపుత్ర ఇండస్ట్రీస్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తనిఖీ చేసి.. ధాన్యం లారీలను వెంట వెంటనే అన్ లోడింగ్ చేయించాలని ఆదేశించారు. హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. వారి వెంట గంభీరావు పేట తహసీల్దార్ మారుతి రెడ్డి, అధికారులు, కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

సర్పంచ్ ఏనుగుల కనకయ్య



**బోయినిపల్లి,మే14 (ప్రజా జ్యోతి):** బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులు గాలిపెల్లి మమత--రమేష్ దంపతుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య హాజరై గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు,ఈ సందర్భంగా మాట్లాడుతూ,పేదల సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని పేర్కొన్నారు,అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తూ,సంక్షేమ పథకాల అమలులో ముందుంటుందని తెలిపారు,గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వప్రధాన లక్ష్యమని అన్నారు,ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మిరుదొడ్డి శ్రీనివాస్ మరియు మాల్యారి రమేష్,జేపీ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## వెదురుగట్టలో "బడిబాట" కార్యక్రమం



**చొప్పదండి మే 14 ( ప్రజాజ్యోతి):** చొప్పదండి మండలం వెదురుగట్టలో విద్యా వారోత్సవాల్లో భాగంగా గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇన్చార్జి ఎంఈఓ, హెచ్ఎం జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని, అడ్మిషన్లకు సర్పంచులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాలరావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలు అనిత, రవీందర్, సర్పంచ్ శ్రీనివాస్, ఏఏపిసి చైర్మన్ తరంగిణి తదితరులు పాల్గొన్నారు. కాగా చొప్పదండి జడ్పీహెచ్ఎస్ (బాయ్స్)లో పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ పై చర్చించారు.

## ఈనెల 17న . పెద్దపల్లి లో. మాదిగ . మహా శక్తి భారీ బహిరంగ సభ



**కాల్వ శ్రీరాంపూర్ మే 14 (ప్రజా జ్యోతి)** ఈ నెల 17న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నీ .ఎంబి గార్డెన్ లో. సాయంత్రం నాలుగు గంటలకు .మాదిగ మహాశక్తి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు. మాదిగ సంఘం నాయకులు. మామిడిపల్లి బాపయ్య. కుక్క అశోక్. కొంకటి లింగమూర్తి. ఆసంపల్లి శ్రీనివాస్. పాల రాజేశం . పాలశంకర్. తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం సమీపంలో. పోస్టర్లను. గురువారం రోజున. ఆవిష్కరించారు. ఈ భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో మాదిగ కులస్తులు. అధిక సంఖ్యలో. తరలివచ్చి. సభను . జయప్రదం చేయాలని . వారు కోరారు.

# కరీంనగర్‌ను వణికించిన పిఎంజె దోపిడీ కేసు ఛేదన..!

- "ది గోల్డెన్ థీఫ్" సుభోద్ సింగ్ గ్యాంగ్ గుట్టురట్టు
- తెలంగాణలో రెండు నెలల రేక్కీ..!
- మహారాష్ట్ర అడవుల్లో ఆయుధాల డీల్..!
- చంద్రపూర్ సమీపంలో అందుకున్న 6 పిస్టల్స్
- కాల్పులు.. రక్తపాతం..రూ.82 లక్షల నగల దోపిడీ
- ముగ్గురు అరెస్ట్.. ఇంకా పరారీలోనే గ్యాంగ్ లీడర్..!




**కరీంనగర్ క్రైం,మే14,ప్రజాజ్యోతి:** కరీంనగర్ నగరాన్ని కుదిపేసిన పిఎంజె జ్యువెలరీ షాప్ దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. అత్యంత ప్రణాళికాబద్ధంగా జరిగిన ఈ భారీ దోపిడీ చేసింది బీహార్,పశ్చిమ బెంగాల్,జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన కరుడుకట్టిన అంతర్ రాష్ట్ర దోపిడీ ముఠా ఈ దోపిడీకి పాల్పడినట్లు గురువారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వివరాలను వెల్లడించారు,ఈ ముఠాను బీహార్ జైలులో నుంచే "ది గోల్డెన్ థీఫ్"గా పేరుగాంచిన సుభోద్ సింగ్ నడిపిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది.గత నెల 3వ తేదీన కరీంనగర్ 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిఎంజె జ్యువెలరీ షాప్‌లో జరిగిన ఈ దోపిడీలో 161.4 తులాల బంగారు ఆభరణాలు,112 క్యారెట్ల వజ్రాభరణాలు కలిపి సుమారు రూ. 82లక్షలకు పైగా విలువైన నగలను దుండగులు దోచుకెళ్లారు. ఈ ఘటనలో షాప్ సిబ్బందిపై కాల్పులు జరపడంతో నలుగురు ఉద్యోగులు గాయపడ్డారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కరీంనగర్ పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్,మొబైల్ డేటా,అంతర్రాష్ట్ర నిఘా సహాయంతో ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జగీరా సింగ్‌ను మే 13న వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద అరెస్ట్ చేశారు.మరో ఇద్దరు నిందితులు రావిష్ కుమార్ అలియాస్ ప్రద్యుమన్,మెహతాబ్ ఖాన్‌లను బీహార్,పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలించారు. పోలీసుల విచారణలో బయటపడిన వివరాలు సినిమాను తలపిస్తున్నాయి.సుభోద్ సింగ్ నాయకత్వంలోని ఈ గ్యాంగ్ ముందుగా లక్ష్యంగా పెట్టుకున్న ప్రాంతాల్లో రేక్కీ నిర్వహించి,దోపిడీ అనంతరం తప్పించుకునే మార్గాలను కూడా ముందుగానే ఖరారు చేసుకునేదని తెలిసింది. నకిలీ ఆధార్ కార్డులు,నకిలీ బైక్ నంబర్ ప్లేట్లు,తప్పుడు పేర్లతో లాడ్జ్‌లలో బస చేయడం,గుర్తుపట్టకుండా ప్రత్యేక సిమ్ కార్డులు వినియోగించడం వంటి పద్ధతులను ఈ ముఠా అనుసరించేది. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం రఘునాథ్ కర్మాకర్,రాధే మిశ్రా అలియాస్ అభయ్,రావిష్ కుమార్, సూర్యమణి కుమార్ అలియాస్ సనోజ్ తదితరులు రెండు నెలల క్రితమే తెలంగాణలోకి ప్రవేశించారు. ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాల్లో తిరుగుతూ పలు జ్యువెలరీ షాపులు, బ్యాంకులపై రేక్కీ నిర్వహించారు. చివరకు కరీంనగర్‌లోని పిఎంజె జ్యువెలరీ షాప్‌ను టార్గెట్‌గా ఎంచుకున్నారు.

మొదట పెద్దపల్లిలోని ఓ లాడ్జ్‌లో బస చేసిన గ్యాంగ్,తర్వాత ధర్మపురిలోని విజయలక్ష్మి గెస్ట్ హౌస్‌కు మారి దోపిడీకి సిద్ధమైంది. ఇదే సమయంలో రఘునాథ్ కర్మాకర్ మంచిర్యాల మీదుగా మహారాష్ట్రలోని చంద్రపూర్ సమీపానికి వెళ్లి అక్కడ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఆరు పిస్టల్స్, మ్యాగజైన్లు స్వీకరించినట్లు పోలీసులు గుర్తించారు. దోపిడీ జరిగిన రోజు ఉదయం నిందితులు రెండు బైక్‌లపై ధర్మపురి నుంచి బయలుదేరి మార్గమధ్యంలో బైక్ నంబర్ ప్లేట్లు మార్చుకున్నారు. అనంతరం వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద టిఫిన్ చేస్తూ చివరిసారిగా ఆపరేషన్‌పై చర్చించారు. ఉదయం 10:50 గంటలకు పిఎంజె జ్యువెలరీ షాప్ వద్దకు చేరుకున్న గ్యాంగ్‌లో రాధే మిశ్రా ముందుగా కస్టమర్‌లా షాప్‌లోకి వెళ్లి పరిస్థితిని పరిశీలించాడు. అతడు మెస్సేజ్ ఇవ్వగానే మిగతా నిందితులు ఆయుధాలతో లోపలికి దూసుకెళ్లి సిబ్బందిని బెదిరించారు. దోపిడీ సమయంలో ఉద్యోగులు ప్రతిఘటించడంతో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో అక్కడ భయానక పరిస్థితి నెలకొంది. నగలను బ్యాగుల్లో నింపుకుని పరారవుతున్న సమయంలో ఒక బ్యాగ్‌ను షాప్‌లోనే వదిలేసి మరో బ్యాగ్‌తో తప్పించుకున్నట్లు ఆయన వెల్లడించారు.

దోపిడీ అనంతరం గ్యాంగ్ సభ్యులు విడిపోయి పరారయ్యారు. కొందరు గోదావరి నది దాటి మంచిర్యాల నుంచి రైలులో పారిపోగా రఘునాథ్ కర్మాకర్ మరో నిందితుడు గుండాల అడవి ప్రాంతానికి చేరుకుని అక్కడ ముందుగా సిద్ధంగా ఉన్న తెలుపు రంగు క్రెటా కారులో ఆభరణాల బ్యాగ్‌ను అప్పగించి బీహార్‌కు పారిపోయినట్లు గుర్తించారు. ఇప్పటివరకు ఈ కేసులో 13 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 51 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు,రెండు సిమ్ కార్డులు, నకిలీ ఆధార్ కార్డు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితుల కోసం ఐదు ప్రత్యేక పోలీస్ బృందాలు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో గాలింపు చేపట్టాయి. అరెస్ట్ అయిన ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్‌పై వివిధ రాష్ట్రాల్లో హత్య, దోపిడీ,ఆయుధ చట్టాల కింద ఏడు కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మరో నిందితుడు రావిష్ కుమార్‌పై 15కు పైగా కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీసులు జ్యువెలరీ షాపులు, బ్యాంకులు,లాడ్జ్‌లు,గెస్ట్ హౌస్ యజమానులకు పలు సూచనలు చేశారు. నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం,ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను నియమించడం,అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించడం,సరైన ఐడీ ధృవీకరణ తర్వాత మాత్రమే గదులు ఇవ్వడం వంటి భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సీపీ సూచించారు. శాస్త్రీయ ఆధారాలు,సాంకేతిక విశ్లేషణ,అంతర్రాష్ట్ర సమన్వయంతో దర్యాప్తు కొనసాగుతోందని,పరారీలో ఉన్న గ్యాంగ్ సభ్యులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

# బంగారంపై కేంద్రం సంచలన నిర్ణయం..!

– ఇళ్లలోని బంగారంపై కేంద్రం ఫోకస్..

త్వరలో కొత్త గోల్డ్ మానిటైజేషన్ పాలసీ

**వేములవాడ,మే14:ప్రజాజ్యోతి :** దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలకు సిద్ధమవుతోంది. ప్రజల ఇళ్లలో నిల్వగా ఉన్న బంగారాన్ని బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడమే లక్ష్యంగా త్వరలో కొత్త 'గోల్డ్ మానిటైజేషన్ పాలసీ' తీసుకురానున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న పథకాల కంటే మరింత సులభతరం చేసి, కనీసం 10 గ్రాముల బంగారం ఉన్న వారికీ బ్యాంకుల్లో డిపాజిట్ చేసే అవకాశం కల్పించేలా కేంద్రం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. భారతీయుల వద్ద సుమారు 30 వేల టన్నులకు పైగా బంగారం నిల్వగా ఉందని అంచనా. అయితే ఈ బంగారం ఎక్కువ భాగం ఇళ్లలో, లాకర్లలోనే ఉండిపోవడంతో దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యక్షంగా ఉపయోగపడటం లేదు. మరోవైపు దేశం ప్రతి సంవత్సరం భారీ స్థాయిలో బంగారం దిగుమతులు చేసుకోవాల్సి వస్తోంది. దీంతో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెరగడమే కాకుండా రూపాయి విలువపై కూడా ప్రభావం పడుతోంది. కొత్త పాలసీలో ఉండే అవకాశ మున్న అంశాలుతక్కువ పరిమా ణంలో బంగారం డిపాజిట్ చేసే అవకాశండిపాజిట్ చేసిన బంగా రంపై వడ్డీపన్ను రాయితీలు లేదా మినహాయింపులుబ్యాంకులద్వారా భద్రత కల్పింపుజ్యూవెలర్లకు బంగారం సరఫరా చేసే విధానం డిజిటల్ గోల్డ్ అకౌంట్లకు ప్రోత్సా హం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 2015లో గోల్డ్ మాని టైజేషన్ స్కీమ్ తీసుకొచ్చినా ప్రజల్లో ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. ప్రధానంగా ఎక్కువ నిబంధనలు, శుద్ధి ప్రక్రియపై ఉన్న సందేహాల కారణంగా ప్రజలు ఆసక్తి చూపలేదు. ఈసారి ఆ సమస్యలను దృష్టిలో పెట్టుకుని మరింత సులభమైన విధానాన్ని తీసుకురావాలని కేంద్రం ఆలోచిస్తున్నట్లు ఆర్థిక వర్గాలు చెబుతున్నాయి. ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం కనీసం 2 వేల టన్నుల బంగారం బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చినా దేశానికి భారీ స్థాయిలో ప్రయోజనం కలగవచ్చు. బంగారం దిగుమతులు తగ్గితే కరెంట్ అకౌంట్ లోటు తగ్గడమే కాకుండా రూపాయి విలువ బలోపేతం అయ్యే అవకాశం ఉంది. అలాగే దేశీయ జ్యూవెలరీ రంగానికి కూడా ముడి బంగారం అందుబాటులోకి రావడం వల్ల ప్రయోజనం కలుగుతుంది. కొత్త పాలసీపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొన్నప్పటికీ, ప్రజలు తమ బంగారం డిపాజిట్ చేసే ముందు వడ్డీ రేట్లు, లాక్-ఇన్ పీరియడ్, తిరిగి పొందే విధానం వంటి అంశాలను పూర్తిగా తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కుటుంబ వారసత్వ బంగారం లేదా ఆభరణాల విషయంలో నిబంధనలు ఎలా ఉంటాయన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

## పొద్దు తిరుగుడు, మొక్కజొన్న పంటల ను కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

**ఇల్లంతకుంట మే 14(ప్రజజ్యోతి)** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని ఐ కె పి సెంటర్లలో పొద్దుతిరుగుడు మొక్కజొన్న పంటలను సైతం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రోజు వంతడుపుల బ్రిడ్జి వద్ద వివిధ గ్రామాల రైతులు రాస్తారోకో చేపట్టినారు ఈ సందర్భంగా రైతులు. మాట్లడుతూ ప్రభుత్వం దిగివచ్చిపంటలను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చేంతవరకు.. ఆందోళన నిర్వహిస్తమని. హెచ్చరించారు ఈ ధర్నా కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల రైతులు రైతుసంగల నాయకులు పాల్గొన్నారు



# ఎన్నికల హామీని నిలబెట్టుకున్న సర్పంచ్

- వివాహంలోనే నూతన వదువుకు రూపాయలు 10,116/- కానుక అందజేత.



గంగాధర మే 14: (ప్రజా జ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ ప్రజాసేవలో ముందుంటామని గంగాధర సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి పునరుద్ఘాటించారు. గంగాధర గ్రామంలో అడ బిడ్డ బూర్ల అనూష వివాహ మహోత్సవానికి సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్పంచ్, తన ఎన్నికల హామీలో భాగంగా సొంత నిధుల నుండి 10,116 (పది వేల నూట పదహారు) రూపాయల నగదును పెళ్లి కానుకగా వధువుకు అందజేశారు. అనంతరం సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి – రాజన్న మాట్లాడుతూ.. గ్రామ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములు కావడమే ధ్యేయమన్నారు. పేద కుటుంబాలపై పెళ్లిళ్ల భారం పడకూడదనే ఉద్దేశంతోనే ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తూ గ్రామాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. సమయానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకున్న సర్పంచ్కు వధువు బూర్ల అనూష కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి మహేందర్ మరియు కార్యకర్తలు ,ప్రజలు పాల్గొన్నారు.

# గంజి వాగు బ్రిడ్జి పూర్తి కాకపోవడం దౌర్భాగ్యం






**బోయినిపల్లి,మే14 (ప్రజా జ్యోతి):** బోయనిపల్లి మండలం స్తంభం పెల్లి గ్రామం బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు అక్కెనపల్లి కరుణాకర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ గంజి వాగు వద్ద ఉన్న హై లెవెల్ వంతెన నిర్మాణంపై మాట్లాడే నైతిక హక్క బి ఆర్ ఎస్ పార్టీ నాయకులకు లేదని మాట్లాడినటువంటి కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యలను మేము ఖండిస్తున్నాం. 2023 టిఆర్ఎస్ ప్రభుత్వం స్తంభం పెల్లి గంజి వాగు కు ఒక కోటి 80 లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగింది. అనంతరం భూమి పూజ చేసి పనులు ప్రారంభించే దశలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రావడం జరిగింది. 2024 నుండి నేటి వరకు స్తంభం పెల్లి బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయాలని వివిధ సందర్భాలలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం జరిగింది. దాదాపుగా రెండు సంవత్సరాల నుండి ప్రజావాణిలో దరఖాస్తులు ఇస్తూనే , ఆయన ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో 1)స్థలం పెల్లి గ్రామం నుండి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేయడం జరిగింది 2)స్తంభం పెల్లి గ్రామం నుండి కలెక్టర్ వరకు బైకు ర్యాలీ చేయడం జరిగింది ఇట్లా ఎన్నో సందర్భాలలో కలెక్టరేట్ ఆఫీస్ చుట్టూ తిరుగుతూ ప్రజలందరి మద్దతును కూడగట్టుకొని ప్రజా ఉద్యమాలు చేసి పెట్టకేలకు బ్రిడ్జ్ 8 శాతం పనులు పూర్తి చేసుకోగలిగిన. మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలని లాస్ట్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కి వినతి పత్రం ఇచ్చి సమస్యను వివరించడం జరిగింది. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వారం పది రోజులలో పనులు ప్రారంభించి బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇట్టి అంశంపై కాంగ్రెస్ నాయకులు సమంపల్లి బ్రిడ్జి గురించి మాట్లాడే నైతిక హక్కులేదని మాట్లాడడం చాలా విడ్డూరంగా ఉందని, బ్రిడ్జి సాధన కోసం స్తంభం పెల్లి గ్రామ ప్రజలు బోయిని పల్లి మండల పరిసర ప్రాంత ప్రజలు టిఆర్ఎస్ పార్టీ పోరాట ఫలితంగానే స్తంభం పెల్లి బ్రిడ్జి చివరి దశకు చేరుకుందని చెప్పేసి ఈ సందర్భంగా చెప్పడం జరుగుతుంది. వీటిపై కాంగ్రెస్ నాయకులు ఇట్లాంటి చర్చలకైనా ఆధారాలతో సహా టిఆర్ఎస్ పార్టీ కృషి ఫలితంగానే పూర్తయింది అని చెప్పేసి ఆధారాలతో మేము ముందుకు వస్తామని చెప్పడం జరిగింది.

## జెడ్ పీ హెచ్ ఎస్ పెదలింగపూర్లో 6వ తరగతి నుండి 10వ తరగతి అడ్మిషన్లు ప్రారంభం




**ఇల్లంతకుంట మే14 (ప్రజజ్యోతి)** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో ౹ాలీ మరియు బడిబాట కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోయిని తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ గన్నారం వసంత నర్సయ్య ఉపసర్పంచ్ ఎల్లవేణి రమేష్ గ్రామ కార్యదర్శి తిరుపతి , వార్డు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వసంత మాట్లాడుతూ పెద్ద లింగాపూర్ గ్రామంలో ఉన్న 6వ తరగతి నుండి 10 వ తరగతి వరకు అర్హత కలిగిన విద్యార్థులు అందరినీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించడానికి కోసం శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా మొదటి అడ్మిషన్ గా సర్పంచ్5 కుమార్తె వర్షినిని పాఠశాలలో జాయిన్ చేయడం జరిగింది ఈ సందర్భంగా పాఠశాల హ్యాబిటేషన్ పరిధిలో ఉన్న సిరికొండ, రామోజీపేట, బోటుమీదిపల్లి నుండి పిల్లలను మన పాఠశాలకు వచ్చేలా ప్రయత్నం చేద్దామని తెలిపారు. పాఠశాల బడిబాట కార్యక్రమంలో మొదటి అడ్మిషన్ సర్పంచ్ కూతుర్ని జాయిన్ చేసినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోయిని తిరుపతి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కొట్టే రజిత ఉపాధ్యాయులందరూ వారికి ప్రత్యేకమైన అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొమ్ము రమేష్, మంద పద్మలత ఆలుగొండ ఉమారాణి కొండ రమేష్ మొదుంపల్లి శ్రీనివాస్ జోగుల పూర్ణిమ చిలుక రోజా అంజలి రికార్డ్ అసిస్టెంట్ చొక్కయ్య పాఠశాల ఆఫీస్ సవార్డినేట్ నారాయణ వంట మనిషి బాబు , ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సందీప్ రెడ్డి ఉపాధ్యాయులు లలిత సునీత తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బడికి పోదాం--బతుకులు మార్చుకుందాం

## పత్తిపాకలో ఘనంగా మెగా పీటీఎం, బడిబాట ర్యాలీ




**ధర్మారం,మే14 (ప్రజా జ్యోత్ ):** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాక ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో గురువారం మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం)తో పాటు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతి మల్లన్న మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన పురోగతి,హాజరు శాతం,పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. మెగా పీటీఎం ద్వారా విద్యార్థుల విద్యా స్థాయిలపై తల్లిదండ్రులతో సమీక్ష నిర్వహించి,వారి సూచనలు స్వీకరించడం జరిగిందన్నారు. అలాగే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం నమోదు సాధించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో "బడికి పోదాం--బతుకులు మార్చుకుందాం" అంటూ నినాదాలు చేస్తూ గ్రామ వీధుల్లో ప్రచారం నిర్వహించారు. 5 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతి బాలబాలికను పాఠశాలలో చేర్పించాలని, చదువు మానేసిన పిల్లలను తిరిగి బడికి రప్పించాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంద్రాతి శ్రీలత,అనుమల్ల శారద, సిరిపురం సునిల్,వార్డు సభ్యులు రెషవేణి మహేష్, ఎదుల్ల అంజయ్య,మాజీ సర్పంచ్ బద్దం సుజాత, ఏఎన్ఎం లక్ష్మి,ఆశా కార్యకర్తలు సరిత,జలజ, యువశక్తి యూత్ సభ్యులు ఇలియాస్,ఇర్ఫాన్, కుమార్ యాదవ్,మహేష్ యాదవ్, రాహుల్, తల్లిదండ్రులు బూర్ల తిరుపతి,ఎదుల్ల అనిల్, ఆకుల మధూకర్,శ్రీనివాస్, ప్రేమ్ కుమార్,మల్లీశ్వరి, ఎదుల్ల అంజలి,మక్తుమ్ భీ, ఎస్ఎంసీ సభ్యులు,గ్రామ పెద్దలు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్ఓసి మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ,మే,14:ప్రజాజ్యోతి.** వేములవాడ నియోజకవర్గం చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఎర్రవెల్లి నియన్ని తీవ్ర అనారోగ్యంతో అత్యవసర చికిత్స అవసరమైన విషయం తెలుసుకున్న వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించారునిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ప్రత్యేక చికిత్స అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం నుండి 2,50,000 రూపాయల విలువ గల ఎల్ ఓ సీ ను వైద్య ఖర్చుల కోసం వెంటనే మంజూరు చేయించారు. ఈ సహాయం అందించడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎల్ ఓ సీ ను వైద్య ఖర్చుల కోసం వెంటనే మంజూరు చేయించారు. ఈ సహాయం అందించడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కు హృదయపూర్వక కృతజ్ఞత లు తెలిపారు.

## దొంగతుర్తి బడిబాట కార్యక్రమం



**ధర్మారం, మే14(ప్రజాజ్యోతి):** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దొంగతుర్తి గ్రామంలో మెగా పిటిఎం మరియు బడిబాట ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి చేపట్టవలసిన కార్యక్రమాలు గురించి తల్లిదండ్రులతో చర్చించారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెరగడం గురించి అందరూ సహకరిం చాలన్నారు. విద్యార్థుల హాజరుకు తల్లిదండ్రులు,గ్రామస్థులు మరియు ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొడారి మంగ,ఉప సర్పంచ్ తమ్మడవేణి రాజయ్య,మాజీ ఎంపీపి కొడారి హన్మయ్య,ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు ఎం. రాములు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. మురళీకృష్ణ, మార్కెట్ డైరెక్టర్ ఆలువాలా రాజేశం,వార్డు సభ్యులు కొమ్మ శ్రావణి పరమేష్, వేల్పుల కుమార్,శంకర్,బానేష్, అరుణ్,దిలీప్,అభి ఉపాధ్యాయులు,గ్రామస్థులు పాల్గొన్నారు

## రేపాక రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ మడేలేశ్వర స్వామి బోనాల జాతర



**ఇల్లంతకుంట మే 14(ప్రజజ్యోతి)** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలములోని రేపాక గ్రామములో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగామదేశ్వరస్వామి బోనాల జాతర రెండు రోజుల వైభవంగా నిర్వహించడం జరుగుతుందనీ రజక సంఘం అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ తెలిపారు గురువారంనుండి శ్రీ మడేలేశ్వర స్వామి మూడో వార్షికోత్సవం సందర్భంగా గురువారం రోజు పోచమ్మ బోనాలు శుక్రవారం శ్రీ మడేలేశ్వర స్వామి వారి బోనాలు జాతర జరుగును కాబట్టి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరరూ ఈకార్యక్రమంలో రజక సంఘం సభ్యులురాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం



ధర్మారం,మే14(ప్రజా జ్యోతి ):మండలంలోని దొంగతుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రేవెల్లి అనూష 541 మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చింది. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ గ్రామ సర్పంచ్ కొడారి మంగ వారికి అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తమ్మడవేణి రాజయ్య, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, మార్కెట్ డైరెక్టర్ ఆలువాల రాజేశం, వార్డు సభ్యులు కొమ్మ శ్రావణి పరమేష్, వేల్పుల కుమార్, అలాగే శంకర్, బానేష్, అరుణ్, దిలీప్, అభి, ఉపాధ్యాయులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# కన్నాల పాఠశాలలో విద్యా వారోత్సవాలు



మంథని, మే 14 (ప్రజాజ్యోతి): మంథని మండలం కన్నాల జడ్పీహెచ్ఎస్ లో తల్లిదండ్రుల- ఉపాధ్యాయుల సమావేశం గురువారం నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ మాట్లాడుతూ పాఠశాలలో డిజిటల్ తరగతులు, సోలార్ పానల్, విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్ డ్రెస్సులు అన్ని ప్రభుత్వ సహకారంతోటి అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు వంగల కీర్తన ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాధిక, సావిత్రి, శ్రీలత, వెంకటేశ్వర్లు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు, మమత 30 మంది తల్లిదండ్రులు ఈ సమావేశంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందని ఇక ముందు కూడా ఇటువంటి సమావేశాలకు పిల్లలు తల్లిదండ్రులు అందరు హాజరైతే బాగుంటుందని ప్రధానోపాధ్యాయులు తెలియజేయడం జరిగింది.

# మహాత్మానగర్ లో ప్రో జయశంకర్ బడిబాట



తిమ్మాపూర్ మే14 (ప్రజాజ్యోతి):-కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మనగర్ గ్రామం లో గురువారం ప్రో జయశంకర్ బడిబాట లో భాగంగా స్థానిక ఎల్ ఎమ్ డి కాలనీ లో గల భవిత కేంద్రం లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించటం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్ ఎం డి కాలనీ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సామినోజు హాజరు అయ్యి దివ్యంగులకు భవిత కేంద్రం అందించే సేవలు ఎంతో విలువైనవి అని కొనియాడారు. అనంతరం గణేష్ ఐఈఆర్ పి మాట్లాడుతూ భవిత అందించిన అలవెన్సస్ ఉపకరణాలు గురించి తెలియజేసారు . ఈ కార్యక్రమాంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ ,భాస్కర్ రెడ్డి ,ముతాజ? ఫాతిమా ,ఐఇఆర్ పి లు రాపర్తి గణేష్ ,పద్మ మరియు దివ్యంగుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు షాక్ తో కౌలు రైతు వృత్తి



బోయినిపల్లి,మే 14 (ప్రజా జ్యోతి): బోయిని పల్లి మండలం కోరెం గ్రామంలో గురువారం పెగడపల్లి మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన గన్నేబోయిన చంద్రయ్య, వయస్సు 49 సంవత్సరాలు, కోరెం గ్రామ శివారులో వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని మామిడి తోటలో వేసిన కరెంటు వైర్‌ను తొలగించే క్రమంలో ఆ వైర్‌ను చేతికి చుట్టుకుంటూ తీసుకెళు ండగా మధ్యలో ఉన్న జాయింట్ వద్ద విద్యుత్ ప్రవహించి ఎడమ చేతి మణికట్టుకు షాక్ తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు చూసి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వేములవాడ రూరల్ సిఐ ఎం. శ్రీనివాస్ తెలిపారు.

# రెండు రోజులుగా ధాన్యం దిగుమతి చేయకపోవడంతో రైతుల ఆందోళన



సుల్తానాబాద్, మే 14: (ప్రజా జ్యోతి) ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని మిల్లులో దిగుమతి చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందంటూ రైతులు ఆందోళనకు దిగారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామ పరిధిలో ఉన్న మమత రైస్ మిల్లు వద్ద రెండు రోజులుగా ధాన్యం లోడుతో వచ్చిన ట్రాక్టర్లు, లారీలను అన్‌లోడ్ చేయకపోవడంతో రైతులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆగ్రహించిన రైతులు రాజీవ్ రహదారిపై ట్రాక్టర్లను అడ్డంగా నిలిపి బైఠాయించి ధర్నాకు దిగారు. దీంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెండు రోజులుగా వాహనాలు మిల్లు వద్దే నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం వాహనాల్లో ఎక్కువసేపు నిల్వ ఉండటంతో నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని, మరోవైపు డీజిల్, కూలీల ఖర్చులు పెరిగి అదనపు భారం పడుతోందని రైతులు తెలిపారు. దిగుమతి విషయంలో పలుమార్లు మిల్లు యాజమాన్యానికి విన్నవించినా స్పందన లేకపోవడంతో నిరసనకు దిగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు రైస్ మిల్లు యజమానితో ఫోన్లో మాట్లాడి వెంటనే అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని, తక్షణమే ధాన్యం దిగుమతి పూర్తి చేయాలని ఆయన సూచించినట్లు సమాచారం. సమాచారం అందుకున్న సుల్తానాబాద్ ఎస్సై చంద్రకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో చర్చించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మిల్లు యాజమాన్యంతో మాట్లాడి అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించినట్లు తెలిసింది. రైతుల సమస్యలపై అధికారులు, మిల్లర్లు సమన్వయంతో తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని బాధిత రైతులు కోరుతున్నారు.

# మండల అధ్యక్షులను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ

### నాలుగు మండలాల్లో కొత్త వారికి అవకాశం

### రెండు మండలాల్లో పాతవారికే కొనసాగింపు

మానకొండూర్, మే14 (ప్రజాజ్యోతి ) కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో మానకొండూర్ నియోజకవర్గంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల నియామకాల్లో మార్పులు చేపట్టారు. ఈ మేరకు మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం మండల అధ్యక్షుల జాబితాను విడుదల చేశారు. మానకొండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ద్యావ శ్రీనివాస్ రెడ్డి (జగ్గయ్యపల్లి), శంకరపట్నం మండల అధ్యక్షునిగా బండారి తిరుపతి (కేశవపట్నం), గన్నేరువరం మండల అధ్యక్షునిగా బొడ్డు సునిల్ (గన్నేరువరం), బెజ్జంకి మండల అధ్యక్షునిగా లింగాల శ్రీనివాస్ (బెజ్జంకి), తిమ్మాపూర్ మండల అధ్యక్షునిగా బండారి రమేశ్ (పోలంపల్లి), ఇల్లంతకుంట మండల అధ్యక్షునిగా కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి (ముస్కానిపేట్)లను నియమించారు. తిమ్మాపూర్, ఇల్లంతకుంట మండలాల్లో పాత అధ్యక్షులకే మరోసారి అవకాశం కల్పించగా, మిగిలిన నాలుగు మండలాల్లో కొత్తవారికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు సాధించడం లక్ష్యంగా పార్టీ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందన్నారు. ఆ దిశగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడంలో భాగంగానే నియోజకవర్గంలో ఈ మార్పులు చేపట్టినట్లు తెలిపారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మండలాధ్యక్షులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

# కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా




### - మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్

మంథని, మే 14 (ప్రజాజ్యోతి): మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను అభివృద్ధి చేసేందుకు తన శాయ శక్తుల కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో జరిగిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జరిగిన పేరెంట్ టీచర్ మీటింగ్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల అభివృద్ధికి రాష్ట్ర ఐ టీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఇప్పటికే నిధులు కేటాయించారని, మంత్రి సహాయ సహకారాలతో కళాశాలను మరింతగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఇంత అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్న ఈ కళాశాల విద్యార్థిని ప్రభుత్వ కళాశాలలో జిల్లాలో మొదటి స్థానం సాధించడం అభినందనీయమన్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ కళాశాలలో చదివే బదులు అదే స్థాయిలో విద్యనందిస్తున్న ప్రభుత్వ సంస్థను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బాలోజీ, అధ్యాపకులు రావుల తిరుమల్, శశాంక్ , శ్రీదేవి, నగేష్, ఎల్ఆర్కే రెడ్డి, సబిత, మౌనిక, సిబ్బంది బియ్యబాని, అనసూయ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# టీఎన్‌జీవోస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వీరగోని శ్రీనివాస్ గౌడ్

### - ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం



పెద్దపల్లి ప్రతినిధి, మే 14 ప్రజా జ్యోతి; టీఎన్‌జీవోస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా గౌరవ శ్రీ బొంకూరి శంకరన్న గారు నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఉద్యోగ సంఘ చరిత్రలో ఒక విశిష్ట ఘట్టమని ఉద్యోగులు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడే నాయకత్వానికి ఇది నిదర్శనమని అభినందించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊర కృష్ణ కుమార్, ప్రధాన కార్యదర్శి సిద్ధ మధు మరియు జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్ల ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా టీ-హబ్ ఆవరణలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జిల్లా సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్, ఉద్యోగుల మార్గదర్శకుడు శ్రీ వీరగోని శ్రీనివాస్ గౌడ్ గారిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు ఎలాంటి సమస్య వచ్చినా ముందుండి పరిష్కారం చూపించే నాయకుడిగా శ్రీనివాస్ గౌడ్ గారు ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. అలాంటి మంచి మనసున్న నాయకుడికి జిల్లా ఉపాధ్యక్ష పదవి రావడం తమ అందరికీ గర్వకారణమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగుల హక్కుల సాధనలో ఆయన కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

# కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి భూమి ఆక్రమణ.. న్యాయం చేయాలంటూ వినతి

**జమ్మికుంట,మే14 (ప్రజాజ్యోతి ):** జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన గిరవెన సారయ్య జిల్లా పోలీసు అధికారిని ఆశ్రయిస్తూ తన సొంత భూమిపై అక్రమ కబ్జా జరుగుతోందని ఫిర్యాదు చేశారు. తనకు చెందిన ఇంటి నెంబర్ 4-7/4 స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం. 3972/2025 ఆధారంగా భూమి తన సొంతమని పేర్కొన్నారు. ఆత్మకూరు రాజయ్య, తండి కనకయ్యతో పాటు కుటుంబ సభ్యులు భాగ్యమ్మ, విజయ్, రంజిత్, సందీప్ కలిసి తన స్థలంలో అక్రమంగా గోడ నిర్మాణం చేపట్టి కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సహకారం కూడా ఉందని తెలిపారు. భూమి వివాదానికి సంబంధించి రాజయ్య జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో తనపై తప్పుడు ఫిర్యాదు చేశారని, తాను భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇంటి పన్ను రసీదులు, స్టాంప్ దస్తావేజులు సమర్పించి న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు చెప్పారు. హుజురాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసు నెం. 765/2026లో తనకు ఇంజక్షన్ ఆర్డర్ జారీ అయినప్పటికీ, కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి ప్రతివాదులు గోడ నిర్మాణం కొనసాగిస్తున్నారని వాపోయారు. తనను, కుటుంబ సభ్యులను బెదిరిస్తూ "స్థలం విషయమై ఎవరితో మాట్లాడినా హత్య చేస్తాం" అంటూ ప్రాణహాని హెచ్చరికలు చేస్తున్నారని



ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక పోలీసులకు కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ అందించినప్పటికీ తగిన రక్షణ కల్పించకుండా ప్రతివాదులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. భూమికి సంబంధించిన పూర్తి ఆధారాలు, జిరాక్స్ పత్రాలు జిల్లా పోలీసు అధికారికి సమర్పిస్తున్నానని, అవసరమైతే భూమి విక్రయ సమయంలో ఉన్న సాక్షులను కూడా విచారణకు హాజరుపరుస్తానని తెలిపారు. తన స్థలంలో అక్రమంగా నిర్మించిన గోడను తొలగించి కుటుంబానికి రక్షణ కల్పించాలని గిరవెన సారయ్య విజ్ఞప్తి చేశారు.

# వ్యవసాయ అవసరాలకే చెరువు మట్టిని వినియోగించాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**రేపటి నుంచి సంబంధిత తహసీల్దార్‌కు రైతులు దరఖాస్తు చేసుకోవాలి**

**రైతులకు ఉచితంగా సారవంతమైన చెరువు మట్టి అందజేత**

**చెరువు మట్టిని ఇతర అవసరాలకు మళ్లిస్తే కఠిన చర్యలు**



**పెద్దపల్లి ప్రతినిధి, మే-14 ప్రజా జ్యోతి;** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువులలోని సారవంతమైన చెరువు మట్టిని తమ వ్యవసాయ భూములకు తరలించేందుకు ఆసక్తి గల రైతులు రేపటి నుంచి సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నీరు లేని చెరువుల నుంచి చెరువు మట్టిని వ్యవసాయ భూములకు తరలించుకోవడానికి అనుమతులు మంజూరు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులో రైతు వివరాలు, భూమి విస్తీర్ణం, పీపీబీ వివరాలు, రవాణా వాహనం వివరాలు, వాహన నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. సంబంధిత తహసీల్దార్ దరఖాస్తులను పరిశీలించి అనుమతులు జారీ చేస్తారని, అనంతరం రైతులు చెరువుల నుంచి చెరువు మట్టిని తరలించుకోవచ్చని కలెక్టర్ వివరించారు. రైతులకు ఈ సారవంతమైన చెరువు మట్టిని పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ చెరువు మట్టిని కేవలం వ్యవసాయ అవసరాలకే వినియోగించాలని స్పష్టం చేశారు. చెరువు మట్టిని ఇతర అవసరాలకు మళ్లించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధించి, కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మే 22వ తేదీన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సభ

**- నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి**

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలిపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష**

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి మే - 14 (ప్రజాజ్యోతి)** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలి 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా ఈ నెల 22వ తేదీన శుక్రవారం జిల్లా స్థాయి సభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మే 22 వ తేదీన శుక్రవారం జిల్లాస్థాయి సభ నిర్వహణపై వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సభలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరు గ్యారంటీలు. వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలతో కరపత్రం రూపొందించాలని, దానిని కార్యక్రమంలో అందజేయాలని తెలిపారు. లబ్ధిదారుల అభిప్రాయాలను అందరికీ వివరించాలని పేర్కొన్నారు. మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతులు, వివిధ పథకాల లబ్ధిదారులను ఆహ్వానించాలని ఆదేశించారు. అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సభలు తెలంగాణ రాష్ట్ర గీతం (జయ జయహే తెలంగాణ) స్వాగతోపన్యాసం, పరిచయం అలాగే సీఎం గారి సందేశం వినిపించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నరకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల వివరాలు, సాధించిన విజయాలపై శాఖల ద్వారా సమాచారం ఇవ్వాలని,



లబ్ధిదారుల పేర్లను చదవాలని, లబ్ధిదారుల అభిప్రాయాలు, అనుభవాలు చెప్పాలని తెలిపారు. ఇప్పటి దాకా అమలు చేస్తున్న వాటిపై చర్చించాలని, భవిష్యత్లో చేపట్టనున్న పనులపై తీర్మానాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మే 18 నుంచి పర్యాటక శాఖ, యువజన వారోత్సవాలు మే 18 వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పర్యాటక శాఖ, యువజన వారోత్సవాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 18 వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 2 కే రన్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీన షెడ్యూల్ ప్రకారం ప్లే అండ్ పార్టిసిపేట్ స్పోర్ట్స్ డే లో భాగంగా సమ్మర్ క్యాంప్ కార్యక్రమాలకు హాజరవుతున్న పిల్లలతో స్పోర్ట్స్ డే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు

మే 22 వ తేదీన పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, అదే రోజు జిల్లా స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, 23 వ తేదీన మెగా జాబ్ మేళా చేపట్టాలని తెలిపారు. మిగతా కార్యక్రమాలు ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, పరిశ్రమల శాఖ అధికారులు హనుమంతు, భారతి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే,

**కొనరావుపేట, మే.14(ప్రజాజ్యోతి)** కొనరావు పేట మండలం ధర్మారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మరియు రైస్ మిల్లును జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే, సందర్శించి విధుల్లో ఉన్న అధికారులను కొనుగోలు ప్రక్రియను గురించి అడిగి తెలుసుకున్నారు. ధాన్యం లోడింగ్ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రైస్ మిల్ యాజమాన్యానికి సూచించారు. అనంతరం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతుల సమస్యలు అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులుదృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని మాయమాటలు చెప్పే దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు



సమాచారం అందించాలని కోరారు. ఎస్పీ వెంట సి.ఐ రవీందర్, ఎస్.ఐ కె ప్రశాంత్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## సుల్తానాబాద్ సీఐ రంజిత్‌రావుకు బీఆర్ఎస్ నేతల సన్మానం




**సుల్తానాబాద్: మే 14 (ప్రజా జ్యోతి)** సుల్తానాబాద్ సర్కిల్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ పి. రంజిత్‌రావును మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రంజిత్‌రావు మాట్లాడుతూ మండలం, పట్టణ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గర్రెపల్లి సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, మండల కన్వీనర్ బోయినీ రాజమల్లు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్, సుద్దాల సర్పంచ్ ఒజ్జ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వారోత్సవాలు భాగంగా తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సమావేశం.



**గంభీరావుపేట మే14 (ప్రజా జ్యోతి);** గంభీరావు పేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో గురువారం రోజున ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక "విద్యా వారోత్సవాలలో " నాలుగవ రోజులో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్. వి. విజయలక్ష్మి గారి అధ్యక్షతన తల్లిదండ్రుల మరియు ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ, కళాశాలలో ఉన్న సమస్యల గురించి విద్యార్థుల యొక్క హాజరు వివరాల గురించి, కళాశాలలో ఉన్న ప్రత్యేకమైన వసతుల గురించి తెలుపుతూ, ఈ కళాశాలలో "బి ఎస్ ఎఫ్ ఐ" కోర్సులో చేరినట్లయితే కోర్సు పూర్తయిన మూడు సంవత్సరాలలో వారికి తప్పనిసరిగా ఉద్యోగం లభించే అవకాశం ఉందని, తెలుపుతూ "దోస్త్" ద్వారా మా కళాశాలలో ఉన్న కోర్సులలో విద్యార్థులను చేర్పించుటలో తల్లిదండ్రులు సహాయ సహకారాలు అందించి కళాశాలలో ఎక్కువ మంది విద్యార్థులు చేరేటట్లుగా తల్లిదండ్రులు సహకారం అందించినట్లయితే ఈ కళాశాల ఎక్కువ అభివృద్ధి చెంది అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా కళాశాలలో హార్వెస్ట్ ఫిట్ నిర్మాణానికి సహకరిస్తామని గ్రామ సర్పంచి పద్మ హామీ ఇస్తూ, అదేవిధంగా లింగన్నపేట గంభీరావు పేట మధ్యలో ఉన్న బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయడానికి పై అధికారులకు మరియు జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకుపోయి బ్రిడ్జి నిర్మాణం త్వరితగతిన పూర్తి అయ్యేటట్లు చేస్తానని ఈ సమావేశంలో హామీ ఇచ్చారు. విద్యా వారోత్సవాలలో భాగంగా ఆల్మనీ ప్రెసిడెంట్ శంకర్ సి హెచ్ రవి, బ్రహ్మచారి, సంధ్య, సతీషు, ఉదయ్, సంపత్, మాటిన్ తదితర పూర్వ విద్యార్థులకు శాలువతో సన్మాన చేయడం జరిగింది. ఏఈడిపి పోస్టర్ను కళాశాల ప్రిన్సిపల్, గ్రామ సర్పంచ్, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్. ఎం ప్రభాకర్, ఐ క్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్. వై. ఆంజనేయులు, ఎన్ఎస్ఎస్ పిఓ పాక ధర్మపురి, టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. శ్రావణ్, స్కాలర్షిప్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ ఆదివిష్ణువు, డబ్ల్యూ ఈ సి కోఆర్డినేటర్ వి. వాణి, డాక్టర్ కె. వి. బిక్షమయ్య, మనోహర్, సూచరణ్, కృష్ణ ప్రసాద్, మహేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, శంకర్ తదితర అధ్యాపకులు అధ్యాపకేతర బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజీనామాను ఆమోదించాలని వినతిపత్రం అందజేసిన ఎస్ఎల్ గౌడ్



**తిమ్మాపూర్ మే 14 ( ప్రజాజ్యోతి ) :-** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలనికి చెందిన సుధాగోని లక్ష్మీనారాయణ గౌడ్ మానకొండూరు నియోజకవర్గం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షనిగ కొన్ని సంవత్సరల నుండి చేస్తున్నాను వ్యక్తిగత కారణాలవల్ల తనకు వద్దని రాజీనామా పత్రాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునికి గురువారం అందజేశారు.

## ఘనంగా లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు



**కొత్తపల్లి మండలం/మే14, (ప్రజా జ్యోతి)** విశ్రాంత ఉపాధ్యాయులు, బిజెపి నాయకులు, రాజరాజేశ్వరీ లైన్స్ క్లబ్ అధ్యక్షులు, 16వ డివిజన్ మల్కాపూర్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు, నరహరి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు మల్కాపూర్ లోని రైతు సంక్షేమ సంఘ భవనంలో రాజరాజేశ్వరి లైన్స్ క్లబ్, రెడ్డి సంక్షేమ సంఘం, జై కిసాన్ రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నరహరి లక్ష్మారెడ్డి ని శాలువాలతో సత్కరించిఘనంగా సన్మానించారు, ధాన్యం కొనుగోలు కేంద్రంలోరైతులకు రాజరాజేశ్వరి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహార వితరణ చేశారు, ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాంతాల జగన్ రెడ్డి, క్లబ్ ప్రధాన కార్యదర్శి బండ కిషన్ రెడ్డి, ఆర్ సి ,ఆర్ ఎస్ పి రెడ్డి, రామచంద్రం పరశు రాములు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు కొత్త మహేష్, కోశాధికారి గంగాధర నరేష్, రెడ్డి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గునుకుల మహిపాల్ రెడ్డి, దేవేందర్ రెడ్డి ,రైతులు పాల్గొన్నారు ,ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సొంత గ్రామం మల్కాపూర్ లో రైతుల సమక్షంలో జన్మదిన వేడుకలు నిర్వహించిన రాజరాజేశ్వరి లైన్స్ క్లబ్, జై కిసాన్ రైతు సంక్షేమ సంఘం, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు

## రైతులు ట్రెండ్ మార్చండి.. పంట మార్పిడితో అధిక లాభాలు పొందండి

**– ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**



**సుల్తానాబాద్, మే14: (ప్రజా జ్యోతి)** రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ట్రెండ్ మార్చుకుని పంట మార్పిడిపై దృష్టి సారించాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సూచించారు. సుల్తానాబాద్ మండలంలోని మియాపూర్ (పెర్కపల్లి) గ్రామంలో గురువారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరిస్తే అధిక దిగుబడులతో పాటు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఒకే రకమైన పంటలపై ఆధారపడకుండా మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పంటలను సాగు చేయడం వల్ల రైతులకు లాభాలు పెరుగుతాయని చెప్పారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం కల్పిస్తున్న కొనుగోలు కేంద్రాలు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయంలో కొత్త విధానాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మినపల ప్రకాష్‌రావు, ఏవో పైడితల్లి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలక సతీష్, సర్పంచులు మేకల పోశాలు, సాయికిరణ్, గుండేటి దేవేందర్, అబ్బోజు కవితాచారి, మాజీ ఎంపిటిసి పకీర్ యాదవ్ మండల రమేష్ అన్నమనేని కొండలరావు ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కోమటిరెడ్డి



**ఇల్లంతకుంట మే 14(ప్రజజ్యోతి)** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మస్కానిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి నీ డి సి సి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఉత్తర్వులు జారీచేశారు ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండవ సారి అవకాశం కల్పించిన మనకొండూర్ ఎం ఎల్ ఏ కవ్వంపెల్లి సత్యనారాయణకు డి సి సి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం కు కృతజ్ఞతలు తెలిపారు రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని తెలిపారు మండలంలో కాంగ్రెస్ పార్టీ నీ బలమైన పార్టీగా తీర్చిదిద్దుతానని తెలిపారు తన నియామకానికి సహకరించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు

## నీట్ స్కామ్‌లకు బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**– ఏ. ఐ. యస్. బి. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ ;**



**కొత్తపల్లి ,కరీంనగర్ రూరల్/మే14, (ప్రజా జ్యోతి)** పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో మే 3, 2026న జరిగిన నీట్ యూజీ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టిఏ ప్రకటించడం సిగ్గు చేటు అని, దీనికి బాధ్యతగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏ. ఐ. యస్. బి. రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏ ఐ ఎస్ బి రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ... గత సంవత్సరం కూడా నీట్ పరీక్ష పత్రం లీక్ కారణంతో నీట్ పరీక్ష రద్దు అయిన విషయం తెలిసిందె అని, మళ్లీ ఈ సంవత్సరం కూడా నీట్ స్కామ్ బయటపడటం ప్రభుత్వం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అని వారు వాపోయారు. పదేపదే పునరావృతమవుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు, జాతీయ పరీక్షా సంస్థ నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తుందని వారు ఆవేదన చేశారు. 2026 మే 3న జరిగిన నీట్ పరీక్ష తర్వాత; రాజస్థాన్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో 'గెస్ పేపర్' పేరుతో సోషల్ మీడియాలో తిరిగిన ప్రశ్నాపత్రం అసలు ప్రశ్నాపత్రంతో సరిపోలినట్లు తెలడం సిగ్గుచేటని వారు దుయ్యాబట్టరు. ఆ గెస్ పేపర్‌లోని 100కు పైగా ప్రశ్నలు అసలు పరీక్షలో వచ్చినట్లు దర్యాప్తులో బయటపడడం,అదేవిధంగా గత సంవత్సరం మాదిరిగానే లీకైన ప్రశ్నాపత్రాలను రూ. 30 వేల నుంచి రూ. 20 లక్షల వరకు విక్రయించినట్లు వారు ఆరోపించారు. నీట్ స్కామ్‌ల వల్ల ముఖ్యంగా లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. వైద్య విద్యకు దూరమవుతున్నారనీ . మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారనీ కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న నీట్ స్కామ్‌లపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, పదేపదే జరుగుతున్న ఈ స్కామ్‌లను పూర్తిగా అరికట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎన్‌టిఏను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే వైద్య ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్ , మెట్టు రాకేష్ ,వంశీ , గణేష్,సురేష్ ,తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఎమ్మెల్యేని కలిసిన టీఎన్జీఓ నూతన కార్యవర్గం



**పెద్దపల్లి ప్రతినిధి మే14 ప్రజా జ్యోతి;** ఎన్జీఓ పెద్దపల్లి జిల్లా అన్ని యూనిట్ల ఎన్నికలు మరియు జిల్లా ఎన్నికలు జరిగి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా వరుసగా నాలుగవ సారి టీఎన్జీఓ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొంకూరి శంకర్ గారు మరియు మొదటి సారిగా కార్యదర్శిగా ఎన్నికైన అయిరెడ్డి సందీప్ రెడ్డి గారు వారి నూతన కార్యవర్గంతో సహా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు మన పెద్దపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు గౌరవ శ్రీ చింతకుంట విజయరమణా రావు గారిని గురువారం రోజున మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సన్మానించి, పుష్పగుచ్ఛం, ఫలాల బుట్టను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు అనితతో పాటు, స్వప్న, సౌమ్య, శిల్ప, స్వప్న, భాగ్యమ్మ, అమరేందర్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్, మహేందర్ రెడ్డి, రాజశేఖర్, నిశాంత్, రాజిరెడ్డి, శివ, రామచంద్రం, ప్రచేతన్ లు పాల్గొన్నారు.

**కలెక్టర్ ని కలిసిన టీఎన్జీఓ నూతన కార్యవర్గం...**

టీఎన్జీఓ సంఘం, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొంకూరి శంకర్ గారు వారి కార్యదర్శిగా అయిరెడ్డి సందీప్ రెడ్డి గారు వారి నూతన కార్యవర్గంతో సహా గురువారం రోజున జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ శ్రీ కోయ శ్రీహర్ష గారిని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారు వరుసగా నాలుగవ సారి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొంకూరి శంకర్ గారిని ప్రత్యేకంగా అభినందించి, వారి కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డి తో సహా వారి కార్యవర్గాన్ని పరిచయం చేసుకొని వారికి శుభాకాంక్షలు తెలియజేసి, పలు సమస్యలపై సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు అనితతో స్వప్న. సౌమ్య, శిల్ప, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, ప్రేమ్ సాగర్, ప్రవీణ్, ప్రకాష్ లు పాల్గొన్నారు. తదుపరి జిల్లా పరిపాలన అధికారి శ్రీ ప్రకాష్ గారిని కలిసి సన్మానించి, వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో బడిబాట విజయవంతం

**– జిల్లా విద్యాశాఖ అధికారి శారద**



**పెద్దపల్లి, ప్రతినిధి మే 14 ప్రజా జ్యోతి;** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక -- విద్యా వారోత్సవాలలో భాగంగా జిల్లాలో నిర్వహించిన నాలుగవ రోజు కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), జి శారద తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాల్లో మొత్తం 510 పాఠశాలలు మరియు కళాశాలల్లో మెగా పీటీఎంలు నిర్వహించగా, వీటిలో 4,395 మంది తల్లిదండ్రులు, 534 మంది పూర్వ విద్యార్థులు (అలుమ్నీ) మరియు 771 మంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా జిల్లాలో 128 కెరీర్ గైడెన్స్ మరియు ఉన్నత విద్యా అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, వీటిలో 2,122 మంది విద్యార్థులు పాల్గొని ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన పొందారని తెలిపారు. అదేవిధంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన కల్పించేందుకు జిల్లాలో 68 వంటల పోటీలు నిర్వహించగా, వైద్య శిబిరాలు కూడా నిర్వహించడం జరిగిందన్నారు. పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు భాగస్వామ్యం కావడం అభినందనీయమని, విద్యాభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని డీఈఓ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను విజయవంతం చేసిన ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు తల్లిదండ్రులకు డీఈఓ కృతజ్ఞతలు తెలిపారు.

## సైబర్ మోసాలపై, రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలి

**– కొనరావుపేట పోలీస్ స్టేషన్ ను ఆకస్మికగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**



**కోనరావుపేట, మే.14(ప్రజాజ్యోతి)** గురువారం రోజున జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే కొనరావు పేట పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసి స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించి ,కేసుల దర్యాప్తులో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి, చట్టపరంగా నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా తరచు గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో మమేకమై సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాహనదారులుకు హెల్మెట్, సిట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే అనర్ధాలు, మైనర్ డ్రైవింగ్ లపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో పని చేసే బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలన్నారు.

ఎస్పీ వెంట సి. ఐ రవీందర్, ఎస్. ఐ కె ప్రశాంత్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# రైతులు తము పండించిన మొక్కజొన్న పొద్దుతిరుగుడు పంటలను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మహా ధర్నా

**ఇల్లంతకుంట మే14(ప్రజజ్యోతి)**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల రైతులు ఆరుకాలం శ్రమించి కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయాలని రోడ్డెక్కారు. తాము పండించిన పొద్దుతిరుగుడు విత్తనాలను కొనుగోలు చేయాలని వంతడుపుల–కరీంనగర్ ప్రధాన రహదారిపై రోడ్డు పై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. గంటల తరబడి రాస్తారోకో చేపట్టిన కూడా ప్రభుత్వం నుంచి గాని ,అధికారుల నుంచి గాని ఏ లాంటి హామీ రాకపోవడంతో, ఇల్లంతకుంట మండల కేంద్రం వద్దకు పాదయాత్రగా రైతులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో ని వివేకానంద విగ్రహం వద్దకు రైతులు ర్యాలీగా చేరుకొని రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు వినూత్న రీతిలో వంటావార్పు రోడ్డుపైనే చేసి నిరసన తెలిపారు. తీవ్రమైన ఎండలో సైతం రైతులు..మహిళా రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. గంటల తరబడి ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వివేకనంద విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. చివరకు ఆందోళన చూసిన పలు గ్రామాల రైతులు తాత్కాలికంగా గ్రీన్ కార్పెట్ ను ఏర్పాటు చేశారు.

**రోడ్డుపై బైఠాయించి గంటల తరబడి నిరసన.... ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**

ఇల్లంతకుంట మండలం కేశన్నపల్లి పత్తికుంట పల్లె, తాళ్లపెల్లి, గాలి పెల్లి, ముస్కాన్ పేట, తో పాటుగా పలు గ్రామాల రైతులు పొద్దుతిరుగు పంటను కొనుగోలు చేయాలంటూ పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతుల ఆందోళన నేపథ్యంలో పోలీసులు భారీ బలగాలను మొహరించాయి. జిల్లా నుంచి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బలగాలు ఇల్లంతకుంటకు చేరుకొని బందో బస్త్ నిర్వహించారు.



**మార్క్ ఫేడ్ డిఎం హామీతో ఆందోళన విరమణ**

మార్క్ఫెడ్ డిఎం హామీతో ఇల్లంతకుంట మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతున్న రైతులు రాస్తారోకోను తాత్కలికంగా విరమించారు.. మార్కెట్ డిఎం మూడు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక పంపించామని, మూడు రోజుల్లో ప్రభుత్వం నుంచి ఒక స్పష్టమైన హామీ వచ్చిన తర్వాత కొనుగోలు చేస్తామని అంతవరకు రైతులు ఎవరు కూడా అధైర్య పడవద్దని.. ఆందోళనకు దిగవద్దని పేర్కొన్నారు. దీంతో రైతులు కొంత సంయమనం పాటించి మూడు రోజులపాటు ఆందోళనను విరమిస్తున్నట్టుగా తెలిపారు.ప్రభుత్వం పంటను కొనుగోలు చేయకుంటే అసెంబ్లీని ముట్టడిస్తాంప్రభుత్వం ప్రొద్దుతిరుగుడు పంటను కొనుగోలు చేయకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామ నిహెచ్చరించారు ఈ కార్యక్రమంలో పలు గ్రామాల కుఃచెందిన రైతులు 200 మంది పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా మట్టి తరలింపు

-వాహనాలు స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు.



**ధర్మారం, మే 14 (ప్రజాజ్యోతి న్యూస్):** అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న జేసీబీ, రెండు ట్రాక్టర్లను ధర్మారం మండల ఆర్ఐ శివకోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని మల్లాపూర్ గ్రామ శివారులోఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు నిర్వహించగా జేసీబీ సహాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్లలో నింపుతున్నట్లు గుర్తించారు. వెంటనే ఒక జేసీబీ, మట్టితో నిండిన రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని సంబంధిత అధికారుల కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఆర్ఐ శివకోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి, ఇసుక వంటి సహజ వనరులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మట్టి తవ్వకాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతుందన్నారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

# విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత

**– పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు**

**– సర్పంచ్ రేనుకుంట్ల శ్యామల–కుమార్**

**ఇల్లందకుంట, మే 14 (ప్రజాజ్యోతి):** ఇల్లందకుంట మండలం సిరిసేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్పంచ్ రేనుకుంట్ల శ్యామల–కుమార్ నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రేనుకుంట్ల శ్యామల–కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడం కోసం ప్రోత్సాహక బహుమతులు ఏర్పాటు చేశామని తెలిపారు. బహుమతులు చిన్నవే అయినప్పటికీ విద్యార్థుల్లో పోటీ తత్వం పెరిగి పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించిందని పేర్కొంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన బొమ్మ అమూల్యకు రూ. 5,000, రెండో స్థానం సాధించిన గుండారపు పవన్‌కు రూ. 3,000, మోటపోతుల రామ్ చరణ్‌కు రూ. 2,000 నగదు



బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాములు నాయక్, ఎస్సై క్రాంతి కుమార్, ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్, ఉపసర్పంచ్ నాగపూరి వంశీ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, విద్యా కమిటీ చైర్మన్ రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సిరిసేడులో హిందూ సమ్మేళనం

**ఇల్లందకుంట, మే14 ( ప్రజాజ్యోతి ):** ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శ్రీ అపర్ణ సోమేశ్వర స్వామి ఆలయంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దావులూరి మురళీధర్ జీ విభాగ్ సహ వ్యవస్థ ప్రముఖ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ కాపాడాలని, సమాజంలో అందరూ కలిసిమెలిసి జీవించే భావన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదరణీయ దాసరి రవీందర్ ఖండ కార్యవాహ, సారంగపాణి, శివయ్య, అశోక్, సర్పంచ్ రేనుకుంట్ల శ్యామల–కుమార్, ఉపసర్పంచ్ సిరిసేడు వంశీ, కొక్కుల దేవేందర్, మురహరి శంకర్, మరిగిద్ద మొగిలి తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభ్యున్నతికి తోడ్పాటును అందించాలి

**పూర్వ విద్యార్థులకు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమేష్ పిలుపు**



**జమ్మికుంట, మే14 (ప్రజాజ్యోతి):** జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభ్యున్నతికి పూర్వ విద్యార్థులు తమవంతు సహకారం అందించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బీ. రమేష్ కోరారు. గురువారం కళాశాలలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులైన సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లుగా గెలుపొందడం అభినందనీయమని అన్నారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడ చదివిన విద్యార్థులు వివిధ రంగాల్లో రాణిస్తూ చైతన్యవంతులుగా ఎదుగుతున్నారని పేర్కొన్నారు. కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరారు. కళాశాలలో వినూత్నమైన జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరు హాస్టల్ వసతులు కల్పించామని చెప్పారు. ఉన్నత విద్యార్హతలు, బోధనా నైపుణ్యాలు కలిగిన అధ్యాపకులు కళాశాలలో ఉన్నారని, నాణ్యమైన డిజిటల్ తరగతుల బోధన అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కొండ అర్జున్, జక్కే కిరణ్, పసుల తిరుమల – వెంకటష్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. ఓదెలు కుమార్, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ గణేష్, దోస్త్ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ మట్టి తవ్వకాలపై పోలీసుల దాడి

**జేసీబీ, ట్రాక్టర్లు స్వాధీనం**



**ధర్మారం, మే 14 (ప్రజా జ్యోతి న్యూస్):** మండలంలోని మల్లాపూర్ గ్రామ శివారులో అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాలపై పోలీసులు దాడి నిర్వహించి జేసీబీతో పాటు మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన నమ్మకమైన సమాచారం మేరకు గురువారం ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీ సహాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్లలో నింపి తరలిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా మట్టి తవ్వి ట్రాక్టర్‌లో నింపుతున్న ఒక జేసీబీ, మట్టితో నిండి ఉన్న ఒక ట్రాక్టర్, మట్టి లోడ్ చేసుకునేందుకు వచ్చిన మరో రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

# ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ.



**కొనరావుపేట, మే.14(ప్రజాజ్యోతి)**కొనరావుపేట మండలం ఎగ్లస్పూర్ గ్రామంలో ఎండల తీవ్రత ను దృష్టిలో ఉంచుకొని సర్పంచ్ పశువుల పోచయ్య,ఉపసర్పంచ్ నామ వసంత రామారావు, వార్డు సభ్యులతో కలిసి ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా నమోదవుతున్నందున ఉపాధి హామీ కూలీలు ఉదయం వేళలోనే పని పూర్తి చేసుకొని ఇంటికి తిరిగి రావాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్ళవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజలు తగినంత నీరు తాగాలని తెలిపారు.

## రాచపల్లిలో ఘనంగా ప్రారంభమైన 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమం



**ఇల్లందకుంట మే14 (ప్రజాజ్యోతి):** రాచపల్లి గ్రామంలో రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాల మరియు హైస్కూల్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో స్కూల్ నుండి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు బడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో పేరెంట్–టీచర్ సమావేశం నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుస అశోక్, గ్రామపంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. బడిబాట కార్యక్రమం మే 14 నుంచి జూన్ 19 వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, విద్యాభిమానులు సహకారం అందించాలని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె రాములు కోరారు. కార్యక్రమంలో హైస్కూల్ సీనియర్ ఉపాధ్యాయులు వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో పాతర్లపల్లి యువకుడి మృతి



**ఇల్లందకుంట మే 14 (ప్రజాజ్యోతి):** ఇల్లందకుంట మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. పాతర్లపల్లికి చెందిన రాం అరుణ్ (22) హైదరాబాద్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం గురువారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో అరుణ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. యువకుడి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు అరుణ్ మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## ప్రజాపాలన. బడిబాట కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం.



**కాల్వ శ్రీరాంపూర్ మే 14 (ప్రజా జ్యోతి)** కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో ప్రజా పాలన. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం రోజున నిర్వహించారు. ప్రధాన కూడలిల గుండార్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకుంటున్న వేముల చరణ్. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి పాఠశాల మొదటి పేపర్ గా నిలిచారు. తారుపల్లి హైస్కూల్ విద్యార్థి ఏ. వర్షిత్ లను పారితోషికం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంగారు రమేష్. ప్రధానోపాధ్యాయులు వెంకటేశం. అత్తే రాజారాం. కే స్వప్న. ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి



**చొప్పదండి, మే 14 (ప్రజాజ్యోతి):** హమాలీలు, లారీల కొరత తదితర సమస్యలు లేకుండా చేసి ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి చొప్పదండి మార్కెట్ యార్డు కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. 42 కేజీల తూకంతోనే కొనుగోలు చేయాలని, రైతులను ఇబ్బంది పెడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఓటర్ల నమోదు కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీలు భాగస్వాములు కావాలని ఆర్డీఓ కె.ఎస్ బి.కుమారి సూచన

**– వేములవాడ నూతన ఆర్డీఓ కే. ఎస్ బి.కుమారి సన్మానించిన అఖిలపక్ష నేతలు.**

**వేములవాడ,మే,14:ప్రజాజ్యోతి** వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నూతనంగా విచ్చేసిన ఆర్డీఓ కె. ఎస్ బి.కుమారి ఈ రోజు సాయంత్రం 4.00 గంటలకు అఖిలపక్ష నేతలతో సమావేశాన్ని నిర్వహించినారు. ఓటర్ల నమోదు కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల శ్రేణులు భాగస్వాములు కావాలని, అన్ని రాజకీయ పార్టీల పక్షాన నియోజకవర్గంలో నున్న అన్ని బూతులకు బూతుకు ఒక్కరి చొప్పున ఎజెంటును నియమించుకోవాలని, ప్రభుత్వ పరంగా కూడా ప్రతి బూతుకు ఒకరు చొప్పున బూతు లెవల్ అధికారులను నియమించడం జరిగిందని ఆర్డీఓ తెలిపారు. ప్రభుత్వ పరంగా బూతులవారిగా నియమించిన దీూా లు మరియు వివిధ రాజకీయ పార్టీల పక్షాన నియమించిన దీూా ల సమన్వయంతో, కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల చేర్పులు మార్పులు, బొకస్ ఓటర్లు నమోదు కాకుండా, చనిపోయిన వారిని ఓటర్ లిస్టు నుండి తొలగించుటకు, డబల్ ఓటర్లు లేకుండా, ఓటర్ల పేర్లు వారి అడ్రస్ లు తప్పుగా పడకుండా చూడాలని ఆర్డీవో గారు దీూా లను, దీూా లను కోరారు. సమావేశంలో అఖిలపక్ష పార్టీల నేతలు వి. నిత్యానందరావు కాంగ్రెస్, పొలాస నరేందర్ బీఆర్ఎస్, పిన్నింటి హన్మాండ్లు బీజేపీ, చింతలకోటి రామస్వామి గౌడ్ టీడిపి, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, డీఏఓ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పేలిన యూపీఎస్ తాత్కాలికంగా నిలిచిన రిజిస్ట్రేషన్లు

**వేములవాడ,మే,14:ప్రజాజ్యోతి** వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం అకస్మాత్తుగా కంప్యూటర్ సిస్టమ్‌కు సంబంధించిన యూపీఎస్ పేలిపోవడంతో కార్యాలయ సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. కార్యాలయంలో ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో అప్రమత్తమైన ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. అయితే ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. యూపీఎస్ పేలిన కారణంగా కార్యాలయంలో విద్యుత్ సరఫరా, కంప్యూటర్ వ్యవస్థలకు అంతరాయం ఏర్పడటంతో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఈ విషయాన్ని సబ్ రిజిస్ట్రార్ విజయ భాస్కర్ వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై సబ్ రిజిస్ట్రార్ విజయ భాస్కర్‌ను వివరణ కోరగా, యూపీఎస్ బ్లాస్ట్ అయిన విషయం నిజమేనని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకునే ప్రజలు సాంకేతిక నిపుణులు వచ్చి యూపీఎస్ మరమ్మత్తు పనులు పూర్తి చేసిన అనంతరం మాత్రమే స్లాట్‌లు బుక్ చేసుకోవాలని సూచించారు. మరమ్మత్తులు పూర్తైన తర్వాత




రిజిస్ట్రేషన్ ప్రక్రియ తిరిగి ప్రారంభమవుతుందని తెలిపారు. అప్పటివరకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

**రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా**

**పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన రామగుండం సిపి**

**హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి**

**డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు**




**పెద్దపల్లి ప్రతినిధి మే 14 ప్రజా జ్యోతి;** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. సీపీ మాట్లాడుతూ....రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు మరింత కృషి చేయాలని కమిషనర్ సూచించారు. రోడ్ సేఫ్టీ నిబంధనలు, హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ ధరించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే నష్టాలపై వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే హాట్‌స్పాట్ ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రమాదాలకు గల కారణాలను అధ్యయనం చేయాలని తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకొని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతిరోజూ ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ప్రజల్లో చైతన్యం పెంపొందిస్తూ, వాహనదారులు అప్రమత్తంగా డిఫెన్సివ్ డ్రైవింగ్ చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

## మాజీ సర్పంచ్ పై భూకబ్జా ఆరోపణలు ?

**మందు డబ్బాతో తహసిల్దార్ కార్యాలయం ముందు హల్ చల్?**

**ఎండపల్లి మే14, ప్రజా జ్యోతి** తమ కు చెందిన భూమి. పై రాజారాంపల్లి మాజీ సర్పంచ్ కన్ను వేశారని, రాజకీయ పలుకుబడితో తమను వేధిస్తున్నారని, తమకు చావే శరణ్యమని రాజరాంపల్లి గ్రామానికి చెందిన గోపనవేని అభిషేక్ వేడుకున్నారు. గురువారం మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో రాష్ట్ర రహదారికి అనుకొని ఉన్న తమ భూమిలో నిర్మాణం చేపడతామని వెళ్లగా మాజీ సర్పంచ్ తన అనుచరులతో వచ్చి వాగ్వాదానికి పూనుకున్నారకి ఆరోపించారు. దీనితో చేసేది ఏమి లేక గోపనవేని అభిషేక్ తన సోదరీమణులతో కలిసి పురుగుల మందు డబ్బాతో తహసిల్దార్ కార్యాలయానికి చేరుకొని మందు డబ్బా తో హల్చల్ చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తనకు చెందిన పట్టా భూమిని రాజారంపల్లి మాజీ సర్పంచ్ గేల్లు చంద్రశేఖర్ యాదవ్ అక్రమంగా కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని గత కొన్ని సంవత్సరాల క్రితం తమ తండ్రి గోపనవేని రమేష్ రాజారాం పల్లి గ్రామానికి చెందిన వేరే వ్యక్తికి భూమి అమ్మకానికి 50 వేల రూపాయలు ముందస్తుగా తీసుకోవడం జరిగిందని ,కానీ భూమి కొనే వ్యక్తి మొత్తం డబ్బులు చెల్లించకపోవడం తొ తమ తండ్రి పట్టా మార్పిడి చేయలేదని ఈ లావాదేవీ లతో ఎలాంటి సంబంధం లేని రాజారాంపల్లి మాజీ సర్పంచ్ సర్వే నెంబర్ 241/2/2/1,గల తమ భూమి నీ కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మాజీ సర్పంచ్ తనా పలుకుబడి ప్రోద్బలంతో తనపై దౌర్జన్యానికి పాల్పడుతూ బెదిరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు తహశీల్దార్ కార్యాలయంలో



అందించిన వినతి పత్రంలో తన సమస్య వివరిస్తూనే వెంట తెచ్చుకున్న పురుగుల మందు డబ్బాను ఒక్కసారి గా తీసి తాగే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది వెంటనే అప్రమత్తమైన స్థానికులు పురుగుల మందు డబ్బాను లాక్కోవడం తో పెను ప్రమాదం తప్పింది,ఏది ఏమైనా అధికారులు తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు,

# కరీంనగర్‌లో ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ

## – టెస్టుల పేరుతో భారీ బిల్లులు..
## – కనీస సౌకర్యాల్లేక రోగుల ఇబ్బందులు
## – ఆరోగ్యశ్రీ దుర్వినియోగం పై ఆరోపణలు..

**కరీంనగర్ బ్యూరో, మే14(ప్రజాజ్యోతి)** కరీంనగర్ నగరంలో ప్రైవేట్ వైద్య రంగం రోజురోజుకు విస్తరిస్తున్నా, అదే స్థాయిలో రోగులపై ఆర్థిక భారం, వైద్య నిర్లక్ష్యం, అక్రమాల ఆరోపణలు కూడా పెరుగుతున్నాయి. చిన్న జ్వరం, సాధారణ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వెళ్లిన రోగులకు అనవసర పరీక్షలు సూచిస్తూ వేల నుంచి లక్షల రూపాయల వరకు బిల్లులు వేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ఆసుపత్రులు ఇప్పుడు వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నగరంలో అనుమతులు, ప్రమాణాలు, మౌలిక సదుపాయాలపై సరైన పర్యవేక్షణ లేకుండా అనేక ప్రైవేట్ ఆసుపత్రులు నడుస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

**“చిన్న రోగం.. పెద్ద బిల్లు”**

సాధారణ జ్వరం, కడుపునొప్పి, వైరల్ ఫీవర్ వంటి సమస్యలతో ఆసుపత్రులకు వెళ్లిన రోగులకు సీటీ స్కాన్‌లు, ఎంఆర్ఐలు, అనేక రక్తపరీక్షలు రాయడం సాధారణమైందని ప్రజలు చెబుతున్నారు. వైద్య అవసరం లేకపోయినా టెస్టులు తప్పనిసరి చేస్తున్నారని, వాటి ద్వారా ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లకు లాభాలు చేకూరుతున్నాయని ఆరోపిస్తున్నారు. కొన్ని కుటుంబాలు వైద్య ఖర్చులతో అప్పుల పాలవుతున్నాయని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స అంటేనే మధ్యతరగతి, పేద ప్రజలు భయపడే పరిస్థితి నెలకొన్నదని బాధితులు చెబుతున్నారు.

**పార్కింగ్ సెల్లార్‌ల్లోనే ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు**

నగరంలోని కొన్ని ఆసుపత్రుల్లో పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్ ప్రాంతాల్లోనే స్కానింగ్ సెంటర్లు, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అగ్నిప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో బయటపడేందుకు సరైన మార్గాలు కూడా లేవని రోగులు వాపోతున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో లిఫ్ట్ సౌకర్యం లేకపోవడం వల్ల వృద్ధులు, అత్యవసర రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమాచారం. వీల్‌చైర్లు, స్ట్రెచర్లు వంటి కనీస అత్యవసర సదుపాయాలు కూడా అందుబాటులో లేని ఆసుపత్రులు ఉన్నాయని చెబుతున్నారు.




**గ్యాస్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీపై సందేహాలు**

ఆక్సిజన్ సిలిండర్లు, గ్యాస్ లైన్లు ఉపయోగిస్తున్నప్పటికీ, అనేక ఆసుపత్రుల్లో గ్యాస్ సేఫ్టీ ప్రమాణాలు పాటిస్తున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫైర్ సేఫ్టీ పరికరాలు పనిచేస్తున్నాయా? అగ్నిమాపక శాఖ అనుమతులు సక్రమంగా ఉన్నాయా? అనే అంశాలపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
గతంలో దేశంలోని పలు ప్రాంతాల్లో ఆసుపత్రుల్లో జరిగిన అగ్నిప్రమాదాల నేపథ్యంలో కరీంనగర్‌లోనూ సమగ్ర తనిఖీలు అవసరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**ఆరోగ్యశ్రీలో అక్రమాల ఆరోపణలు**

కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు రోగుల వద్ద నేరుగా నగదు వసూలు చేసి, అదే సమయంలో ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వానికి బిల్లులు సమర్పిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ పేరుతో పేదలకు ఉచిత వైద్యం అందాల్సి ఉండగా, కొందరు ఆసుపత్రులు దానిని ఆదాయ వనరుగా మార్చుకున్నారనే విమర్శలు ఉన్నాయి.
రోగులకు పూర్తిస్థాయి బిల్లులు ఇవ్వకపోవడం, క్యాష్ రూపంలో డబ్బులు తీసుకోవడం, అవసరం లేని అడ్మిషన్లు చేయించడం వంటి అంశాలపై కూడా ఫిర్యాదులు వస్తున్నాయి.

**అధికారులపై కూడా ఆరోపణలు**

సంబంధిత శాఖల అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించడం లేదని, కొందరు ఆసుపత్రి యాజమాన్యాలు ముడుపులు ఇచ్చి అక్రమాలను కప్పిపుచ్చుకుంటున్నాయనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఫైర్, మున్సిపల్, హెల్త్, లేబర్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**సమగ్ర విచారణకు డిమాండ్**

జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులపై ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి,మౌలిక సదుపాయాలు ఫైర్ సేఫ్టీ,గ్యాస్ సేఫ్టీ,పార్కింగ్ నిబంధనలుఆరోగ్యశ్రీ అమలు,డాక్టర్ల అర్హతలుల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్ల అనుమతులురోగుల నుంచి వసూలు చేస్తున్న ఛార్జీలువంటి అంశాలపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుని, ప్రజలకు నాణ్యమైన మరియు పారదర్శక వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నగర ప్రజలు కోరుతున్నారు.

**కరీంనగర్‌లో ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీపై సమగ్ర విచారణ జరపాలి:**
**ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం**

కరీంనగర్ పట్టణంలో ఎటువంటి అనుభవం లేకుండా విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షులు, డాక్టర్ మేడిపల్లి సత్యం గారు నేడు జిల్లా కలెక్టర్ కు లేఖ రాశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కరీంనగర్‌లో చాలా ప్రైవేట్ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలు అత్యంత దయనీయంగా ఉన్నాయి. ధనవంతులు పూర్తిగా వ్యాపార ధోరణితో కుమ్మక్కై ఆసుపత్రులు పెడుతున్నారు. అర్హత లేని డాక్టర్లు, సిబ్బందిని తక్కువ జీతాలకు పెట్టుకుని వారితో శస్త్రచికిత్సలు చేయిస్తూ రోగుల ప్రాణాలతోచెలగాటమాడుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. లిఫ్టులు, వీల్‌చైర్లు, బెడ్లు వంటి అత్యవసర సౌకర్యాలు లేవు, వీటిపై పర్యవేక్షణ అవసరం, సరైన పారిశుద్ధ్యం లేక రోగులు నరకం చూస్తున్నారు. చిన్న జ్వరం వచ్చి చికిత్స కోసం డాక్టర్ ను సంప్రదిస్తే అనవసర పరీక్షలు రాసి లక్షల్లో బిల్లులు దోచుకుంటున్నారు. ఇది ప్రజారోగ్యంతో వ్యాపారం చేయడమే” అని ఆరోపించారు. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వెంటనే జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను లేఖలో కోరినట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం. కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీని సహించేది లేదు. ప్రజల ప్రాణాలతో ఆటలాడే ఆసుపత్రులపై ఉక్కుపాదం మోపాల్సిందే” అని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు.

# పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు విజయవంతం

## – ప్రత్యేక భూమిక పోషించిన జిల్లా కలెక్టర్, ఎస్ పి
## – కృతజ్ఞతలు తెలిపిన ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి

**మల్యాల, మే14,ప్రజా జ్యోతి:** పెద్ద జయంతి ఉత్సవాల నిర్వహణలో అన్ని శాఖలను సమన్వపరచి ఉత్సవాలను విజయవంతం చేసిన జిల్లా కలెక్టర్ కి, జిల్లా ఎస్పీ కి, వివిధ శాఖల అధికారులకు ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట భద్రతా, పారిశుద్ధ్య, తాగునీరు, వైద్య మరియు రవాణా ఏర్పాట్లు చేసిన అధికారుల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అలాగే ఉత్సవాల సమయాలను వైభవాలను ప్రజలకు చేరవేసిన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆలయ సంప్రదాయాలను పాటిస్తూ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన ఆలయ అర్చక స్వాములు, మినిస్ట్రియల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, సేవకులు ఆలయ సిబ్బంది అందరి కృషి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు సహకరించి ఉత్సవాలను ప్రశాంతంగా ముగియడానికి తోడ్పడినందుకు వారికి ఈఓ కృతజ్ఞతలు తెలిపారు.

**– గత సంవత్సరం కంటే పెరిగిన ఆదాయం**

హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాల సందర్భంగా వివిధ టికెట్ల ద్వారా వచ్చిన



ఆదాయాన్ని శుక్రవారం ఆలయ ఈవో అంజన రెడ్డి ఒక ప్రకటనలో విడుదల చేశారు. లడ్డు ప్రసాదం ద్వారా 99 లక్షల 79 వేల 525 రూపాయలు, పులిహోర ప్రసాదము ద్వారా 15 లక్షల41,360 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. అలాగే దీక్షా విరమణ ద్వారా 32 లక్షల 66,600 రూపాయలు, కేశఖండన ద్వారా 8 లక్షల37,200 రూపాయలు, శీఘ్ర దర్శనం ద్వారా 17 లక్షల 94 వేల 200 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. మొత్తంగా హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా ఒక కోటి 74 లక్షల 18 వేల 905 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. గత సంవత్సర హనుమాన్ జయంతి తో పోల్చుకుంటే 24 లక్షల రూపాయల ఆదాయం అదనంగా వచ్చినట్లు ఆయన తెలిపారు.

# బీర్‌పూర్‌లో ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ ధర్నా తహసీల్దార్ హామీతో విరమణ



**బీర్ పూర్, మే14, ప్రజా జ్యోతి:** రైతుల వడ్లను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ బీర్‌పూర్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో టోకెన్ల జాప్యం, తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కష్టపడి పండించిన ప్రతి గింజను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. రైతుల ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన ట్రాక్టర్లు, లారీల ద్వారా కొనుగోలు కేంద్రాల నుండి తరలిస్తామని మండల తహసీల్ధార్ హామీ ఇవ్వడంతో నాయకులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షులు ఆడెపు నర్సయ్య, జిల్లా కార్యదర్శి పాత రమేష్, కోమన్నపల్లి సర్పంచ్ సీపతి రమేష్, పార్టీ నాయకులు నారపాక అశోక్, కొండ మల్లేష్, ఉయ్యాలా స్వామి, బండారి రవి, మెండు శ్రీనివాస్, సామల గంగాధర్, జైశెట్టి శ్రీనివాస్, అప్పల జలంధర్, ఆడెపు రమేష్, ఉమేష్ రెడ్డి, రఘు రెడ్డి, సంగ శ్రీనివాస్, మేడిశెట్టి మల్లయ్య, బండారి శేఖర్, మండలంలోని అన్ని గ్రామాల రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన గ్రామ శాఖ అధ్యక్షుడు

**గొల్లపెల్లి మే14 ప్రజాజ్యోతి** గొల్లపెల్లి మండలం అబ్బాపూర్ కాంగ్రెస్ పార్టీకి గ్రామ శాఖ అధ్యక్షుడు జక్కుల ధనంజయ్ రాజీనామా చేశారు అబ్బాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు జక్కుల ధనంజయ్ పార్టీలో విలువలు లేకపోవడం వివక్షకు గురికావడంతో గురువారం నాడు కాంగ్రెస్ పార్టీకి మరియు గ్రామ శాఖ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు ప్రభుత్వ పనితీరు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ముఖ్యంగా వడ్ల కొనుగోలు ఐకేపీ సెంటర్లలో సక్రమంగా జరగకపోవడంతో రైతులు నష్టపోతున్నారని విమర్శించారు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు పూర్తి భరోసా ఉండేది ఇలాంటి సమస్యలు లేవుఇకపై మాజీ మంత్రి ఈశ్వర్ అన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరి ప్రజల కోసం పని చేస్తానని నిర్ణయించుకున్నాను అని తెలిపారు



## గాయపడిన రైతు కుటుంబానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ 50.000 వేయిలు ఆర్థిక సహాయం



**గొల్లపెల్లి మే14 ప్రజాజ్యోతి** గొల్లపల్లి మండలం అగ్గిమల్ల గ్రామానికి చెందిన రైతు గుడ్ల రాజయ్య ఇటీవల జరిగిన టిప్పర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారురాజయ్య చికిత్స కోసం రూ 50 వేల ఆర్థిక సహాయాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతుల ద్వారా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు రైతు కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చినట్లు తెలిపారుఈ సందర్భంగా స్థానిక రైతులు గ్రామస్తులు మంత్రి సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు

## తుంగూర్ గ్రామంలో మృతురాలి కుటుంబానికి రూ. 2 లక్షల బీమా చెక్కు అందజేత



**బీర్ పూర్, మే14, ప్రజా జ్యోతి:** అనారోగ్యంతో మరణించిన బీర్పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన పిట్టల శోభ (42) కుటుంబానికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద మంజూరైన రూ. 2 లక్షల చెక్కును గురువారం అందజేశారు. మృతురాలికి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో బీమా ఉండటంతో, మేనేజర్ విక్రమ్ సహకారంతో సారంగాపూర్ ఫైనాన్సియల్ లిటరసీ అధికారులు కొద్ది రోజుల్లోనే క్లెయిమ్ పూర్తి చేయించారు. ఈ చెక్కును సర్పంచ్ రాజగోపాల్, మేనేజర్ రవికుమార్ సమక్షంలో నామినీ అయిన మృతురాలి తల్లి గంగమ్మకు బహూకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో లిటరసీ అధికారులు విజయ్, వనజ, సౌజన్య, నిరూప, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## భూపతిపూర్‌లో ఘనంగా "బడిబాట" కార్యక్రమం



**రాయికల్, మే14 (ప్రజా జ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన "బడిబాట" కార్యక్రమాన్ని రాయికల్ మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు రెండు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల గుండా ఇంటింటికి వెళ్లి బడీడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. విద్య ప్రాముఖ్యత, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాభిమానులు, తల్లిదండ్రులు పాల్గొని ఉపాధ్యాయులకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం భవన మహేందర్, నాయకులు జక్కుల చంద్రశేఖర్, మహేశ్వర్ రావు, సుధాకర్ రావు, జక్కుల రాజేంద్ర ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు యు. వి. రమణి, వేణుగోపాల్, మల్లేశం పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, శంకరయ్య, సహబాజ్ హుస్సేన్, సంజయ్ కుమార్, వేణుగోపాల్, సురేష్, రాజగోపాల్, పుష్పలత, కమారుద్దీన్, మారుతి, వెంకటేష్, నవలత, ఓ. ఎస్. సాయబు తదితరులు మరియు గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

# గల్ఫ్ మిత్రుల ఉదారత బాధితులకు ఆర్థిక సహాయం

**బీర్ పూర్, మే14, ప్రజా జ్యోతి:** విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి గల్ఫ్ మిత్రులు అండగా నిలిచారు. సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన యాదరవేని భూమన్న ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు పూర్తిగా దహనమైంది. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు గల్ఫ్ కార్మికులు జాల సంతోష్, చేకుట మోహన్ మరియు వారి స్నేహితులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. తమ వంతు సహాయంగా సేకరించిన రూ. 12,000/- నగదును స్థానిక సర్పంచ్ చేకుట అరుణ - శేఖర్ చేతుల మీదుగా బాధితులకు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి గల్ఫ్ యువత ఆర్థికంగా అండగా నిలవడం అభినందనీయమన్నారు. ప్రమాదం కారణంగా భూమన్న కుటుంబానికి ప్రస్తుతం నిలువ నీడ లేదని, దాతలు ఎవరైనా ఉంటే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు న్యారబోయిన వంశీతో పాటు స్థానిక యువత పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**ఎండపల్లి, మే14, ప్రజా జ్యోతి** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని గుల్లకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుండి, అల్పాహారం ఏకరూప దుస్తులు, బూట్లు, పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు పెన్నులు రంగులు అద్దే పెన్సిల్లు తదితర వస్తువులు అందించడంతోపాటు ఆరోగ్యకరమైన రుచికరమైన భోజనం పోషకాహారం, నాణ్యమైన విద్యా బోధనకై వేలాది కోట్ల రూపాయల ఖర్చు చేస్తుందని బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పేర్కొన్నారు తెలంగాణ రాష్ట్రంలో, ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యా వారోత్సవాలు గురువారం రోజున ప్రాథమిక పాఠశాల గుల్లకోట ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయ బృందం రమాదేవి ప్రశాంత్ నరేష్ కుమార్ కృష్ణారెడ్డి శ్రీలత శిరీష తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు, అలాగే ధర్మపురి నియోజకవర్గంలోనే ఉత్తమ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ గా సేవలందిస్తున్న ఓర్పుల లావణ్యను సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరీ లక్ష్మణ్ కుమార్ సన్మానించిన సందర్భంగా గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి వార్డు సభ్యులు ఉపాధ్యాయులు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు,

# అల్లీపూర్‌లో ఘనంగా శ్రీ పెద్దమ్మతల్లి జాతర బోనాలు

### - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ బోగ శ్రావణి

**రాయికల్, మే14 (ప్రజా జ్యోతి)**
రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పెద్దమ్మతల్లి జాతర బోనాలు మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ బోగ శ్రావణి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజల సుఖశాంతులు, రైతుల అభివృద్ధి, యువతకు మంచి భవిష్యత్తు కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. జాతర సందర్భంగా గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. మహిళలు సంప్రదాయ బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించగా, డప్పుల మోతలు, మంగళ వాయిద్యాలు, భక్తి గీతాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. ఈ సందర్భంగా డాక్టర్ బోగ శ్రావణి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. గ్రామ పెద్దలు,



ముదిరాజ్ సంఘం నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, ముదిరాజ్ సంఘం సభ్యులు, బీజేపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులను సన్మానించిన మాజీ ఉపసర్పంచ్.



**మేడిపల్లి మే14 ప్రజా జ్యోతి** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని కల్వకోట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల వెలువడిన పదవ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రామ మాజీ ఉపసర్పంచ్ బన్న రాజేందర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు త్రిలోచనారెడ్డి, సురేందర్, మాజీ సర్పంచ్ లక్ష్మీరాజ్యం, నాయకులు కటకం భూమేష్, లింగంపల్లి భరత్, పానుగంటి రాజకుమార్, మెషిన్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# రాయపట్నం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## – ఒకరు మృతి,నలుగురికి గాయాలు,



**ఎండపల్లి, మే14 ప్రజా జ్యోతి** వివాహ శుభకార్యానికి వెళుతూ జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నం మూల మలుపు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగి, ఒకరి మృతి చెందగా మరి కొంత మంది తీవ్రంగా గాయపడ్డారు, వివాహానికి వెళ్లే క్రమంలో ఆ ఇంట్లో విషాదమే మిగిలింది, స్థానికుల సమాచారం మేరకు ఎండపల్లి మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన తరల్ల రాయమల్లు, ప్రవీణ్ గోపాల రాజయ్య మొగిలి, మరో వ్యక్తితో కలిసి, మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం లో జరుగుతున్న బంధువుల వివాహ శుభకార్యానికి గురువారం రోజున బయలుదేరారు, ఈ క్రమంలో వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి రాయపట్నం మూలమలుపు వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్ను ఢీ కొట్టిందని, ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న తరాల రాయమల్లు అక్కడికక్కడే మృతి చెందగా, గోపాల రాజయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు, కారులో ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు సైతం తీవ్రంగా గాయపడ్డారు, మృతి చెందిన వ్యక్తి మృతదేహంతోపాటు, గాయపడిన వారిని హుటాహుటిన ధర్మపురి పోలీసులు జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు, వీరిలో గోపాల రాజయ్య ఆరోగ్యం విషమంగా ఉండడంతో, అతన్ని కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తున్నట్లుగా సమాచారం,

# బుగ్గారం పోలీసులకు సమాచార కమిషన్ నోటీసులు




## – విచారణకు హాజరు కావాలని ఆదేశాలు

**బుగ్గారం, మే14(ప్రజాజ్యోతి ):** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల పోలీస్ అధికారులకు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించే విచారణకు హాజరు కావాలని కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. సమాచార హక్కు చట్టం కింద దాఖలైన రెండు వేర్వేరు దరఖాస్తులకు సంబంధించి కోరిన సమాచారం ఇవ్వడంలో బుగ్గారం మరియు ధర్మపురి సర్కిల్ పోలీస్ అధికారులు విఫలమయ్యారని ఆరోపిస్తూ ప్రముఖ ఆర్టీఐ కార్యకర్త, సీనియర్ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్ట్ చుక్క గంగారెడ్డి తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన దాఖలు చేసిన రెండు వేర్వేరు అప్పీల్ కేసులపై విచారణ చేపట్టనున్న సమాచార కమిషన్, సంబంధిత పోలీస్ అధికారులను వ్యక్తిగతంగా హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. కేసులకు సంబంధించిన పూర్తి వివరాలు, సమాచారం ప్రతులు, సంబంధిత రికార్డులతో సహా విచారణకు హాజరు కావాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారగా, సమాచార హక్కు చట్టం అమలుపై అధికార యంత్రాంగం స్పందన ఎలా ఉంటుందన్నదానిపై ఆసక్తి నెలకొంది.

# ఘనంగా సమ్మర్ అబాకస్ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం



**మేడిపల్లి, మే14 ప్రజాజ్యోతి:**మేడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గ్రాసూ)లో విద్యార్థుల గణిత నైపుణ్యాలను పెంపొందించేందుకు నిర్వహించిన సమ్మర్ అబాకస్ శిక్షణ శిబిరం ఘనంగా ముగిసింది. వేసవి సెలవుల్లో విద్యార్థులకు గణితంపై ఆసక్తిని, ఏకాగ్రతను పెంచే ఉద్దేశంతో ఈ ప్రత్యేక తరగతులను నిర్వహించారు. ? శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థినీ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలను (సర్టిఫికెట్స్) అందజేశారు. విద్యార్థులు అబాకస్ పద్ధతిలో వేగంగా లెక్కలు చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు.

**నిర్వాహకులకు అభినందనలు**

ఈ శిక్షణ శిబిరాన్ని ప్రముఖ శిక్షకులు మధు నిర్వహించారు. ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులు నేర్చుకున్న మెళకువలు వారి భవిష్యత్తు చదువులకు ఎంతో దోహదపడతాయని ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు కొనియాడారు. ? ఈ



కార్యక్రమంలో మేడిపల్లి ఎస్సై మాడ శ్రీధర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ హమీద్, మెట్టు దాసు, లాజర్ మెట్టు ప్రకాష్, రాకేష్, గోస్కి మధు, రాజశేఖర్,రవి గంగరాజం,విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూపతిపూర్‌లో ఘనంగా పోచమ్మ తల్లి బోనాల పండుగ



**రాయికల్, మే14 (ప్రజా జ్యోతి)** రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల పండుగను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలకు శాంతి, సుభిక్షాలు కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు కోమటిరెడ్డి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు రొండ్ల రాజేశం, కార్యదర్శి కామని హరీష్, కోశాధికారి కొమ్ము దిలీప్ కుమార్‌తో పాటు గ్రామ నాయకులు, మండల నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# జగ్గని ఒర్రె అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## – పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మల్యాల,మే 14, ప్రజా జ్యోతి: ఏండ్ల తరబడి మల్యాల మేజర్ గ్రామపంచాయతీ ప్రజలకు సమస్యగా మారిన జగ్గని ఒర్రె అభివృద్ధికి నోచుకుంది. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రెండు కోట్ల 46 లక్షల నిధులతో శుక్రవారం జగ్గని ఒర్రె అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మత్తడి చెరువు నుండి సూరప్ప చెరువు వరకు సిసి గైడ్ వాల్స్ నిర్మాణము జగ్గని గొర్రె అభివృద్ధి గురించి స్థానిక నాయకులతో చర్చించి పరిసరాలలో తిరిగి వీక్షించారు. అనంతరం స్థానిక నవదుర్గ శక్తిపీఠం ను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మల్యాల లో మండలేశ్వర స్వామి ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై బోనాల పండుగలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ప్రమాణ స్వీకారం




**జగిత్యాల టౌన్, మే14 (ప్రజాజ్యోతి):** జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. డీఎంహెచ్ఓ డా. సుజాత జ్యోతి ప్రజ్వలన చేసి, నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. వైద్యులు సేవా భావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, వైద్యుల ఐక్యతతోనే ప్రజారోగ్య రంగం బలోపేతమవుతుందని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త అధ్యక్షుడిగా డా. అమరేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా డా. జైపాల్ రెడ్డి, ట్రెజరర్‌గా డా. నవీన్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డా. కృష్ణమూర్తి, డీసీహెచ్ఎస్ డా. రామకృష్ణ, ప్రిన్సిపాల్ డా. సుభాష్‌తో పాటు సుమారు 100 మంది వైద్యులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి,



**ఎండపల్లి, మే14 ప్రజా జ్యోతి** మండలంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది, వెల్గటూర్ ఎస్సై పి ఉదయ్ కుమార్ తెలిపిన సమాచారం మేరకు సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన ఎర వెల్లి పరశురాం (43) ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామ శివారులో కూడలి వద్ద తన యొక్క కారు రోడ్డు పక్కన పార్కింగ్ చేసి రోడ్డు దాటే క్రమంలో ఏదో గుర్తు తెలియని వాహనం బలంగా ఢీ కొనడంతో తీవ్ర గాయాలు కాగా సంఘటన స్థలంలోనే మృతి చెందడం జరిగింది, కాగా మృతునికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుర్లు,సంతానం కాగా మృతుని భార్య గత నాలుగు సంవత్సరాల కిందట మృతి చెందింది,మృతుడు వృత్తిరీత్యా కరీంనగర్ లో ఉంటూ సోడా బండి నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడని మృతుని తల్లి ఎరవెల్లి లింగవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు,